ANN తెలుగు

Follow: @mahaadaily

28-11-2025

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్

సంపుటి- 22 సంచిక- 339 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## శుక్ర మౌఢ్యమి ఎఫెక్ట్..
### కళ్యాణ ఘడియలకు బ్రేక్..

80 రోజులు శుభకార్యాలు బంద్!

ముహూర్తాల కోసం పడిగాపులు తప్పవు

వెలవెలబోనున్న కళ్యాణ మండపాలు

ఫిబ్రవరి 17 వరకు పెళ్లి బాజాలకు విరామం

మూఢమి నీడలో మాఘమాసం


**ఖమ్మం, మహా:** *భారతీయ సంస్కృతిలో వివాహం అనేది కేవలం రెండు మనసుల కలయిక మాత్రమే కాదు, రెండు కుటుంబాల అనుబంధం. బలమైన ముహూర్తంలో ఒక్కటైన జంట నూరేళ్ల పాటు సుఖసంతోషాలతో వర్ధిల్లుతుందన్నది మన అనాది నమ్మకం. అందుకే పెళ్లి చూపుల నుంచి పీటల మీద కూర్చునే వరకు ప్రతి ఘట్టాన్ని పండితులు నిర్ణయించిన శుభఘడియల్లోనే జరిపించుకుంటాం.

మిగతా 2లో

టాప్ న్యూస్

## డీకే సీఎం అయితే ఓకే

- ముఖ్యమంత్రి అవ్వాలనే ఆకాంక్ష నాకూ ఉంది
- పార్టీకి డీకే చేసిన కృషి గురించి హైకమాండ్‌కు తెలుసు
- కర్ణాటక హోం మంత్రి జి.పరమేశ్వర సంచలన వ్యాఖ్యలు



02

## కేటీఆర్..డ్రామా ఆపండి


- బీసీల గొంతు కోసింది బీఆర్ఎస్సే
- కేటీఆర్ అసత్య ప్రచారాన్ని ఖండించిన మంత్రి సీతక్క
- స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు తగ్గించిన ఘనత బీఆర్ఎస్‌దే అని ఫైర్
- బీసీలకు 42% సీట్లు ఇస్తారా? మాజీ మంత్రికి సీతక్క ఛాలెంజ్




02

## కేటీఆర్ అంటేనే ఐరన్ లెగ్..

- కేసీఆర్ లేకపోతే నీ ఐడెంటిటీ ఎక్కడిది?
- కేసీఆర్ ఉన్నంత వరకే బీఆర్ఎస్‌లో హరీశ్ రావు
- కేటీఆర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి



02



## రంగనాథ్‌పై హైకోర్టు ఆగ్రహం

### వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాల్సిందే...

**హైదరాబాద్, మహా:** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంట వివాదంలో డిసెంబర్ 5వ తేదీ లోపు కోర్టు ఎదుట ప్రత్యక్షంగా హాజరు కావాలని ఏవీ రంగనాథ్‌ను ఆదేశించింది. లేకుంటే నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని ఆయన్ని హైకోర్టు హెచ్చరించింది.

మిగతా 2లో



## కేసీఆర్ ఓఎస్డీని విచారించిన అధికారులు


### ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్ట్

**హైదరాబాద్, మహా :** ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు దూకుడు పెంచారు. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఓఎస్డీ రాజశేఖర్ రెడ్డిని గురువారం విచారణ చేశారు. రెండు గంటల పాటు విచారణ జరిపి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఈ విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది.

మిగతా 2లో

# హైదరాబాద్.. తగ్గేదెలే...

- భారత్‌లోనే అతిపెద్ద ప్రైవేట్ రాకెట్ ఫ్యాక్టరీ ప్రారంభం
- అమెరికాకు స్పేస్ ఎక్స్ .. ఇండియాకు స్కైరూట్
- స్పేస్ టెక్ హబ్ ఆఫ్ ఇండియా గా హైదరాబాద్
- స్వయంగా ప్రారంభించిన ప్రధాని మోదీ
- తెలంగాణ ప్రభుత్వ ప్రోత్సాహకాలతో.. నూతన ఆవిష్కరణలు
- స్కైరూట్ విజయం భారత యువశక్తికి స్ఫూర్తి: ప్రధాని మోదీ



**హైదరాబాద్ -మహా:** భారత అంతరిక్ష చరిత్రలో మరో గొప్ప అధ్యాయం రాసుకుంది. హైదరాబాద్లోని స్కైరూట్ ఏరోస్పేస్ కొత్త ఇన్ఫినిటీ క్యాంపస్ గురువారం ప్రారంభమైంది. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రాకెట్ ఉత్పత్తి కేంద్రంగా నిలిచిన ఈ ఫ్యాక్టరీ, భారత అంతరిక్ష రంగాన్ని ప్రపంచం ముందు కొత్త స్థాయికి తీసుకెళ్లనుంది. ప్రపంచంలో స్పేస్ ఎక్స్ ఎలా అమెరికాను అంతరిక్ష రంగంలో ముందుకు నడిపించినదో, భారతదేశానికి ఆ పాత్ర స్కైరూట్ భుజాన పెట్టుకున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఫ్యాక్టరీని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



02

# యానిమేషన్, గేమింగ్, ఫిల్మ్ టెక్ హబ్‌గా తెలంగాణ

### తెలంగాణ విజన్ 2047తో పక్కా రోడ్‌మ్యాప్

2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం

హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాలుగా క్రీడా కేంద్రాలు

తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్, మహా:** తెలంగాణ అభివృద్ధిని ప్రతిబింబించేలా తెలంగాణ ఎదుగుదల 2047 విధాన పత్రం ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. 2034 నాటికి 1 లక్ష కోట్ల, 2047 నాటికి 3 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు స్పష్టమైన ప్రణాళిక అవసరమని తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి కోసం కోర్‌పట్టణ ప్రాంత ఆర్థిక వ్యవస్థ, పరిసరపట్టణ ప్రాంత ఆర్థిక వ్యవస్థ, మరియు గ్రామీణ వ్యవసాయ ప్రాంత ఆర్థిక వ్యవస్థగా మూడు మండలాలుగా విభజించి అభివృద్ధి చేసుకోవాలని ఆయన దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, యువతకు మెరుగైన ఉపాధి లక్ష్యంగా విజన్ 2047కు సిద్ధమవుతున్నట్లు, రాబోయే 22 ఏళ్ల కార్యాచరణను డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించే ప్రపంచ సదస్సులో ప్రభుత్వం ఆవిష్కరించబోతోందని తెలిపారు.

**మౌలిక వసతులు, ఆర్థిక రంగాల బలోపేతం**

హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ తెలంగాణ మధ్య అభివృద్ధి సమతుల్యత సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతం కోసం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేలా వ్యవసాయ కార్యాచరణ కూడా ఈ విజన్ పత్రంలో భాగంగా ఉంటుంది.

మిగతా 2లో



ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్- హరిణ్య రెడ్డి వివాహ రిసెప్షన్ కు హాజరై వధూవరులను ఆశీర్వదించిన సీఎం రేవంత్ రెడ్డి

## ఆ పాలసీలో కుంభకోణానికి
# ఆస్కారమే లేదు

- ఇండస్ట్రీయల్ పాలసీ ప్రతిపక్షాల ఫేక్ ప్రచారం
- బీజేపీ, బీఆర్ఎస్ మేం తెచ్చిన పాలసీ అర్థం కాలేదు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, మహా:** ఇండస్ట్రీయల్ పాలసీపై కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని పొల్యూషన్ ఫ్రీగా చేయడమే తమ ప్రభుత్వ పాలసీ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈ పాలసీలో కుంభకోణానికి ఆస్కారమే లేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం తెచ్చింది పారదర్శకమైన పాలసీ అని చెప్పుకొచ్చారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు తాము తెచ్చిన ఇండస్ట్రీయల్ పాలసీ అర్థం కాలేదని తెలిపారు. ప్రతిపక్షాల నేతలు కావాలనే తమ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు ఇండస్ట్రీలను ఓఆర్ఆర్ బయటకు పంపాలనే డిమాండ్ ఉందని గుర్తుచేశారు. ఈ పాలసీ తమ ప్రభుత్వం కొత్తగా తెచ్చినది కాదని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వంలో కూడా ఈ పాలసీపై చర్చ జరిగిందని గుర్తుచేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

**ఎలాంటి కుంభకోణం జరగలేదు..**

బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదని... పాలసీ మార్చేది లేదని చెప్పుకొచ్చారు. ఇండస్ట్రీయల్ పాలసీ రూపకల్పనలో తాను భాగమై ఉన్నానని వివరించారు. కొత్త ఇండస్ట్రీయల్ పాలసీతో తెలంగాణ రాష్ట్రానికి అదనపు ఆదాయం వస్తుందని చెప్పుకొచ్చారు.

మిగతా 2లో

## పల్లె పోరులో ఎర్ర కోటల గర్జన..


### హస్తం కుస్తీలో కామ్రేడ్ల
# కొత్త ఎత్తుగడ!

- కమ్యూనిస్టుల 'సైలెంట్ ఆపరేషన్' షురూ!
- మధిరలో మంటలు.. చింతకానిలో చిచ్చు..
- సామినేని హత్యతో మారిన పొలిటికల్ సీన్.
- ఉనికి కోసం సాగుతున్న ధర్మయుద్ధాలు!
- జిల్లాల్లో అగ్గిరాజేస్తున్న పొత్తు చిక్కులు..
- కేడర్‌కు 'హై'కమాండ్ ఫ్రీ హ్యాండ్



**ఖమ్మం బ్యూరో, మహా:** పల్లెసీమలు రాజకీయ రణరంగాన్ని తలపిస్తున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికల నగారా మోగడంతో, ప్రశాంతంగా ఉండే పల్లెల్లో ఇప్పుడు అధికారం కోసం అలుపెరగని పోరాటం మొదలైంది. నామినేషన్ల పర్వం ప్రారంభం కావడంతో రాజకీయ వేడి తారా స్థాయికి చేరింది. అయితే, రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి అధికార కాంగ్రెస్, దాని మిత్రపక్షాలైన సీపీఐ, సీపీఎంల బంధంపైనే పడింది. హైదరాబాద్ లో "దోస్తీ" అంటూ చేతులు కలిపిన నాయకులు, పల్లెల్లో మాత్రం "కుస్తీ"కి సై అంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి వెన్నుదన్నుగా నిలిచిన వామపక్షాలు, ఈ స్థానిక సమరంలో

మిగతా 2లో



# హైదరాబాద్.. తగ్గేదెలే

## భారతదేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రాకెట్ ఫ్యాక్టరీ ప్రారంభం

అమెరికాకు స్పేస్ ఎక్స్.. ఇండియాకు స్కైరూట్

స్పేస్ టెక్ హబ్ ఆఫ్ ఇండియా గా హైదరాబాద్

స్వయంగా ప్రారంభించిన ప్రధాని మోదీ

తెలంగాణ ప్రభుత్వ ప్రోత్సాహకాలతో.. నూతన ఆవిష్కరణలు

స్కైరూట్ విజయం భారత యువశక్తికి స్ఫూర్తి: ప్రధాని మోదీ

**హైదరాబాద్ -మహా:** భారత అంతరిక్ష చరిత్రలో మరో గొప్ప అధ్యాయం రాసుకుంది. హైదరాబాద్లోని స్కైరూట్ ఏరోస్పేస్ కొత్త ఇన్ఫినిటీ క్యాంపస్ గురువారం ప్రారంభమైంది. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రాకెట్ ఉత్పత్తి కేంద్రంగా నిలిచిన ఈ ఫ్యాక్టరీ, భారత అంతరిక్ష రంగాన్ని ప్రపంచం ముందు కొత్త స్థాయికి తీసుకెళ్లనుంది. ప్రపంచంలో స్పేస్ ఎక్స్ ఎలా అమెరికాను అంతరిక్ష రంగంలో ముందుకు నడిపించినదో, భారతదేశానికి ఆ పాత్ర స్కైరూట్ భుజాన పెట్టుకున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఫ్యాక్టరీని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశంలో ప్రైవేట్ స్పేస్ కంపెనీలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం సూచిస్తోంది. ఐటీ, స్టార్టప్, అంతరిక్ష టెక్నాలజీ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల కారణంగా, హైదరాబాదు ఇప్పుడు స్పేస్ టెక్ హబ్ ఆఫ్ ఇండియా గా దూసుకుపోతున్నది.

### స్కైరూట్ విజయం భారత యువశక్తికి స్ఫూర్తి: ప్రధాని మోదీ

స్కైరూట్ విజయం భారత యువశక్తికి స్ఫూర్తిని ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. అతిపెద్ద ప్రైవేట్ రాకెట్ ఫ్యాక్టరీని గురువారం ప్రారంభించారు. స్కైరూట్ ఇన్ఫినిటీ హైదరాబాద్ క్యాంపస్‌ను వర్చువల్‌గా ప్రధాని ప్రారంభించారు . తొలి ప్రైవేట్ కమర్షియల్ రాకెట్ విక్రమ్ 1ను ఆవిష్కరించారు. అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ రాకెట్ ఫ్యాక్టరీ స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్‌ను ప్రారంభించామని చెప్పుకొచ్చారు. స్పేస్ సెక్టార్‌లో కోఆపరేటివ్, ఎకో సిస్టమ్‌ను తీసుకొచ్చామని వివరించారు. జన్ జీ అనుకున్నది సాధించేలా కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హాజరయ్యారు.

### భారత అంతరిక్ష పరిశ్రమలో కొత్త దశ

2022 నవంబర్‌లో భారత తొలి ప్రైవేట్ రాకెట్ విక్రమ్‌ఎస్ విజయవంతంగా ప్రయోగించిన స్కైరూట్, ఇప్పుడు భారీ స్థాయి ఉత్పత్తి దశలోకి అడుగుపెట్టింది. ప్రపంచంలో స్పేస్X ఎలా అమెరికాను అంతరిక్ష రంగంలో ముందుకు నడిపించినదో, **భారతదేశానికి ఆ పాత్ర స్కైరూట్ భుజాన పెట్టుకున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



**ఫ్యాక్టరీ ముఖ్యాంశాలు**

| అంశం | వివరాలు |
|---|---|
| సంస్థ | స్కైరూట్ ఏరోస్పేస్ |
| ప్రాంగణం | 2 లక్షల చదరపు అడుగులు (200,000 sq ft) |
| ప్రత్యేకత | ప్రైవేట్ రంగంలో ఇండియాలోనే అతిపెద్ద రాకెట్ ఫ్యాక్టరీ |
| సామర్థ్యం | ప్రతి నెల ఒక రాకెట్ తయారీ |
| స్థానం | హైదరాబాద్ |

### భవిష్యత్ లక్ష్యాలు

**స్కైరూట్ యాజమాన్యం వెల్లడించిన భవిష్యత్ ప్రణాళికలు:**

- తక్కువ ఖర్చుతో ప్రయోగించగల విక్రమ్ సిరీస్ లాంచ్ వెహికల్స్ అభివృద్ధి
- చిన్న, మధ్య తరహా ఉపగ్రహాలకు డెడికేటెడ్ లాంచ్ సేవలు
- ప్రపంచ స్పేస్ మార్కెట్‌ను టార్గెట్ చేయడం
- స్కైరూట్ రాకెట్ ఫ్యాక్టరీ ప్రారంభం కేవలం ఒక పరిశ్రమ ప్రకటన కాదు.. ఇది భారత్ స్వయం సమృద్ధి అంతరిక్ష యుగానికి నాంది.

# కేటీఆర్..డ్రామా ఆపండి

## బీసీల గొంతు కోసింది బీఆర్ఎస్సే..

- కేటీఆర్ అసత్య ప్రచారాన్ని ఖండించిన మంత్రి సీతక్క
- స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు తగ్గించిన ఘనత బీఆర్ఎస్దే అని ఫైర్
- బీసీలకు 42% సీట్లు ఇస్తారా? మాజీ మంత్రికి సీతక్క ఛాలెంజ్

**హైదరాబాద్, మహా:** బీసీ రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం 17 శాతానికి తగ్గించిందన్న బీఆర్ఎస్ నేత కేటీఆర్ వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఘాటుగా స్పందించారు. గురువారం నాడు ప్రజాభవన్లో ఆమె మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల అంశంపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అబద్ధాల ప్రచారాన్ని ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. 2014లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించగా, 2019 స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ రిజర్వేషన్లను ఏకంగా 22 శాతానికి తగ్గించి, బీసీల గొంతు కోసిందని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్ చేసిన ఈ అన్యాయాన్ని బీసీ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని అన్నారు. అలాగే, 2019లో బీఆర్ఎస్ ఖరారు చేసిన సర్పంచ్ రిజర్వేషన్లను రాష్ట్రం యూనిట్‌గా తీసుకోవడాన్ని సుప్రీంకోర్టు తప్పుపట్టిందని గుర్తుచేశారు.

బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధితోనే రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన పూర్తి చేసి, అసెంబ్లీలో తీర్మానం ఆమోదించిందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేసి, దాని నివేదిక ఆధారంగానే రిజర్వేషన్లు ఖరారు చేశామని వివరించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తప్పనిసరిగా పాటించాల్సి వచ్చిందని, కొన్ని మండలాల్లో ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉండటంతో, ఆ పరిమితిని దాటకుండా ఉండేందుకే బీసీ రిజర్వేషన్లలో స్వల్ప మార్పు జరిగిందని స్పష్టం చేశారు. అంతేకాకుండా, బీఆర్ఎస్ నేతలు కుల గణనలో పాల్గొనలేదని, రిజర్వేషన్లు నిలిచిపోవాలని కోర్టుల్లో అడ్డంకులు సృష్టించిన పార్టీ బీఆర్ఎస్సేనని ఆమె విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పీసా చట్టం, రాజ్యాంగ హక్కుల ప్రకారమే 100 శాతం గిరిజనులకు రిజర్వేషన్లు కేటాయించినట్లు తెలిపారు.

బీఆర్ఎస్ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య విభేదాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. "అసత్య ప్రచారాలు ఎక్కువకాలం నిలవవు. నిజం మాత్రం చరిత్రలో శాశ్వతంగా నిలుస్తుంది" అని కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి సిద్ధంగా ఉందని, పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వపరంగా పోరాటం చేస్తూనే, పార్టీ పరంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు కేటాయించేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందని, అదే విధంగా 42 శాతం సీట్లు ఇచ్చేందుకు బీఆర్ఎస్ సిద్ధమా అని మంత్రి సీతక్క సవాల్ విసిరారు. స్థానిక ఎన్నికలు ఆలస్యమైతే కేంద్రం నుంచి వచ్చే రూ.3,000 కోట్లు నిలిచిపోయి గ్రామ అభివృద్ధిపై ప్రభావం చూపుతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

# డీకే సీఎం అయితే ఓకే

- ముఖ్యమంత్రి అవ్వాలనే ఆకాంక్ష నాకూ ఉంది
- పార్టీకి డీకే చేసిన కృషి గురించి హైకమాండ్‌కు తెలుసు
- కర్ణాటక హోం మంత్రి జి.పరమేశ్వర సంచలన వ్యాఖ్యలు



**కర్ణాటక, మహా:** కర్ణాటకలో 'సీఎం మార్పు'పై పోరు ఇంకా కొనసాగుతుంది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు అత్యంత సన్నిహితుడు, కర్ణాటక హోం మంత్రి జి.పరమేశ్వర కీలక వ్యాఖ్యలు చేశారు. నాయకత్వ మార్పునకు అధిష్ఠానం అంగీకరించిన క్రమంలో.. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సీఎం అయ్యేందుకు తాను పూర్తిగా మద్దతిస్తానని తెలిపారు. ఓ మీడియాతో మాట్లాడుతూ పరమేశ్వర ఈ వ్యాఖ్యలు చేశారు. 'సీఎం ఆకాంక్షల గురించి ఎవరైనా అడిగితే.. నేను రేసులో ఉన్నానని చెబుతుంటా. కానీ, అధికార మార్పిడి జరిగి.. డీకేకు సీఎం బాధ్యతలు అప్పగించినా మేము దానికి అంగీకరిస్తాం' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనకు కూడా ముఖ్యమంత్రి అవ్వాలనే ఆకాంక్ష ఉందన్నారు. పార్టీ కోసం తాను చేసిన కృషి గురించి హైకమాండ్‌కు పూర్తిగా తెలుసని, తుది నిర్ణయం వారిదేనన్నారు. ఆ క్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా కర్ణాటక సీఎం పదవికి తగిన వ్యక్తి అన్నారు. అయితే, సిద్ధూ, డీకేల మధ్య ఎలాంటి ఒప్పందం జరిగిందనే విషయం తనకు తెలియదు' అని అన్నారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై జరుగుతున్న ప్రచారానికి ఇంకా తెరపడలేదు. సీఎం సీటు కోసం సిద్ధూ, డీకేల మధ్య కోల్డ్‌వార్ కొనసాగుతుంది. ఈ క్రమంలో సిద్ధూ శిబిరం నుంచి ఇలాంటి ఓ ప్రకటన రావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నాయకత్వ మార్పుపై ఊహాగానాల వేళ.. డీకే శివకుమార్ పెట్టిన పోస్టు ఆసక్తిరంగా మారింది. మాట నిలబెట్టుకోవడం అనే అర్థం వచ్చేలా ఆయన ఎక్స్‌లో ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. దానిపై 'ఒక మాటకు ప్రపంచానికి ఉన్నంత బలం ఉంటుందనే సామెత ఉంది. అంటే ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం ప్రపంచంలోనే అతిముఖ్యమైన శక్తుల్లో ఒకటి. అది న్యాయమూర్తి, భారత రాష్ట్రపతి, నేను, మీరు, ఎవరైనా.. ఇచ్చిన మాటను గౌరవించాలి' అని ఉంది.

## రంగనాథ్‌పై హైకోర్టు ఆగ్రహం

### వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాల్సిందే...


(మొదటిపేజీ తరువాయి)

బతుకమ్మకుంట వ్యవహారంలో హైకోర్టుకు ఏవీ రంగనాథ్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఆయనపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. బతుకమ్మకుంటలోని ప్రైవేట్ స్థలంపై హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి మార్పులు చేర్పులు చేయవద్దంటూ ఈ ఏడాది జూన్12వ తేదీన కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉల్లంఘించారంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ ప్రైవేట్ స్థలంలో ఎటువంటి చర్యలు తీసుకోవద్దంటూ ఆయనకు సూచించింది. అంతేకాకుండా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలంటూ రంగనాథ్‌ను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. కానీ కోర్టుకు హైడ్రా కమిషనర్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

# శుక్ర మౌఢ్యమి ఎఫెక్ట్.. కళ్యాణ ఘడియలకు బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

అయితే, ముహూర్తమే ప్రధానంగా సాగే ఈ శుభకార్యాల సందడికి తాత్కాలికంగా తెరపడనుంది. కళ్యాణ తోరణాలు, సన్నాయి మేళాలతో కళకళలాడాల్సిన ఇళ్లు ఇక కొద్ది రోజుల పాటు నిశ్శబ్దంగా మారనున్నాయి. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న శుక్ర మౌఢ్యమి (మూఢం) కారణంగా దాదాపు మూడు నెలల పాటు శుభకార్యాలకు విరామం కలగనుందికళ్యాణ గడియల కోసం ఎదురుచూస్తున్న వారికి, నూతన గృహప్రవేశాలకు సిద్ధమవుతున్న వారికి నిరాశ తప్పేలా లేదు. ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శుక్ర మౌఢ్యమి ప్రభావం వచ్చే ఏడాది ఫిబ్రవరి 17వ తేదీ వరకు కొనసాగనుంది. మాఘ బహుళ అమావాస్య వరకు ఈ మూఢమి ప్రభావం ఉండటంతో, అప్పటి వరకు ఎటువంటి శుభకార్యాలు నిర్వహించడానికి శాస్త్రం అంగీకరించదు. దీంతో సుమారు 80 రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో పెళ్లి బాజాలు మోగవు. నిత్యం కళ్యాణోత్సవాలతో కిటకిటలాడే ద్వారకాతిరుమల వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలు, ఇతర ఆలయాల్లోనూ ఈ సమయంలో నిశ్శబ్దం ఆవరించనుంది. ఇప్పటికే సంబంధాలు కుదుర్చుకుని సిద్ధంగా ఉన్న వధూవరుల కుటుంబాలు, మంచి ముహూర్తాల కోసం వచ్చే ఏడాది ఫిబ్రవరి దాకా వేచి ఉండక తప్పని పరిస్థితి నెలకొంది. విశేషమేమిటంటే, సాధారణంగా వివాహాలకు అత్యంత అనుకూలమైన మాసంగా భావించే



'మాఘమాసం' ఈసారి పూర్తిగా మూఢంలోనే కలిసిపోయింది. మాఘమాసం ఎప్పుడొస్తుందా అని ఆశగా ఎదురుచూసేవారికి ఇది చేదు వార్తే. ఈ ఏడాది మాఘమాసంలో ఒక్క బలమైన ముహూర్తం కూడా లేకపోవడం గమనార్హం. కేవలం వివాహాలే కాదు, గృహ ఆరంభాలకు, గృహ ప్రవేశాలకు అత్యంత పవిత్రమైన రోజులుగా భావించే రథసప్తమి, వసంత పంచమి, మాఘ పౌర్ణమి వంటి విశేష తిథులు కూడా ఈసారి మూఢమి ప్రభావంతో నిస్సారంగా మారిపోయాయి. దీంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాల్సిన ఈ పండుగ రోజుల్లోనూ శుభకార్యాల సందడి కనిపించదు. మరోవైపు, ఈ 80 రోజుల విరామం ఆయా రంగాలపై ఆధారపడిన వ్యాపారులకు గడ్డు కాలంగా మారనుంది. పెళ్లిళ్ల సీజన్‌పైనే కోటి ఆశలు పెట్టుకున్న ఫంక్షన్ హాల్స్ యజమానులు, క్యాటరింగ్ నిర్వాహకులు, డెకరేషన్ నిపుణులు, ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు, పురోహితులు, బాజా భజంత్రీల వారు ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కోనున్నారు. అలాగే వస్త్ర దుకాణాలు, బంగారు ఆభరణాల షాపులు, పూల వ్యాపారులు, ట్రావెల్స్ వంటి అనుబంధ రంగాలన్నీ ఈ మూడు నెలల పాటు వ్యాపారం లేక వెలవెలబోయే పరిస్థితి కనిపిస్తోంది. లక్షల రూపాయల టర్నోవర్ జరిగే ఈ సీజన్‌లో బ్రేక్ పడటం ఆర్థికంగా పెద్ద దెబ్బ అని వ్యాపారులు వాపోతున్నారు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం, ఒక గ్రహం సూర్యుడికి అతి సమీపంలోకి వచ్చినప్పుడు లేదా సూర్య కిరణాల ప్రభావంతో కనుమరుగైనప్పుడు దానిని 'మూఢం' లేదా 'మౌఢ్యమి' అంటారు. ఈ సమయంలో ఆయా గ్రహాల శక్తులు క్షీణిస్తాయి. ముఖ్యంగా దాంపత్య జీవితానికి, సుఖసంతోషాలకు కారకుడైన శుక్రుడు బలహీనపడినప్పుడు చేసే వివాహాలు ఆశించిన ఫలితాలను ఇవ్వవని పండితులు చెబుతున్నారు. శుభకార్యాలకు గురుడు ఎంత ముఖ్యమో, శుక్ర బలం కూడా అంతే కీలకం. శుక్రుడు బలహీనంగా ఉన్నప్పుడు వివాహాలు జరిపితే దంపతుల మధ్య అన్యోన్యత లోపించడం, ఆర్థిక ఇబ్బందులు తలెత్తడం వంటి ప్రతికూల ఫలితాలు వస్తాయని శాస్త్రం హెచ్చరిస్తోంది. అందుకే, ఈ 80 రోజులు ఓపిక పట్టి, మూఢమి వీడిన తర్వాతే శుభకార్యాలు జరుపుకోవడం శ్రేయస్కరమని పండితులు సూచిస్తున్నారు.



## కేసీఆర్ ఓఎస్డీని విచారించిన అధికారులు

### ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్ట్

(మొదటిపేజీ తరువాయి)

గత ఏడాది మార్చిలో అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావు స్టేట్‌మెంట్ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. రాధా కిషన్ రావు స్టేట్‌మెంట్‌లో అప్పటి సీఎం కేసీఆర్ పేరు ప్రస్తావనకు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. కేసీఆర్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్‌లో సన్నిహితుల వ్యవహారాలు చక్కబెట్టేందుకు తాము పని చేశామని గతంలో రాధా కిషన్ రావు స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. ఈ క్రమంలోనే కేసీఆర్ ఓఎస్డీ రాజశేఖర్ రెడ్డి స్టేట్‌మెంట్‌ను సైతం సిట్ అధికారులు రికార్డు చేశారు.

## ఆ పాలసీలో కుంభకోణానికి ఆస్కారమే లేదు

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసినా ప్రతిపక్షాల నేతలకు వ్యతిరేకించాలనే ఉద్దేశ్యం తప్పా ఏం లేదని విమర్శించారు. అయితే, నల్గొండ డీసీసీ నియామకంపై స్పందించడానికి నిరాకరించారు. పార్టీ ఇంటర్నల్ విషయాలను బయట మాట్లాడనని తెలిపారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. తమ ప్రభుత్వంలో విద్యుత్ శాఖలో ఎలాంటి కుంభకోణం జరగలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ హయాంలో భద్రాద్రి కొత్తగూడెం పవర్ ప్రాజెక్టు పెద్ద కుంభకోణం జరిగిందని ఆరోపించారు. గత ప్రభుత్వం ఇండియా బుల్ అనే కంపెనీ దగ్గర ఉపయోగంలో లేని ఎక్విప్‌మెంట్ ఎందుకు కొన్నదని ప్రశ్నించారు. భద్రాద్రి ప్రాజెక్టులో అవుట్ డేటెడ్ టెక్నాలజీ వాడాల్సిన అవసరం ఏముంది..? అని నిలదీశారు. భద్రాద్రి ప్రాజెక్టు అనవసరంగా తెలంగాణ ప్రజలపై రుద్దిన ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు చేశారు.

# పల్లె పోరులో ఎర్ర కోటల గర్జన..

(మొదటిపేజీ తరువాయి)

మాత్రం సరికొత్త, సంచలనాత్మక వ్యూహాన్ని అమలు చేస్తున్నాయి. "స్నేహం కోసం పార్టీని బలిపెట్టలేం.. మా అడ్డాలో మాదే రాజ్యం" అంటూ కమ్యూనిస్టులు తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అధికార పార్టీకి ముచ్చమటలు పట్టిస్తోంది. అసలు సిసలైన రాజకీయ చదరంగం ఇప్పుడు గ్రామాల్లో మొదలైంది.

**మిత్రపక్షమా? ప్రత్యర్థా?.. తేల్చుకోలేకపోతున్న కాంగ్రెస్***

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ను గద్దె దించడమే లక్ష్యంగా కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలు ఒకే తాటిపైకి వచ్చాయి. ఆ మైత్రి ఫలించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. సీపీఐకి ఎమ్మెల్యే పదవి కూడా దక్కింది. అంతా సవ్యంగా సాగుతుందనుకున్న సమయంలో పంచాయతీ ఎన్నికలు చిచ్చు రేపాయి. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీల గుర్తులు ఉండకపోయినప్పటికీ, గ్రామాల్లో రాజకీయ ఆధిపత్యం నిరూపించుకోవడానికి ఇవి అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో, తమకు తిరుగులేని బలం ఉన్న గ్రామాల్లో కాంగ్రెస్ కోసం తప్పుకునే ప్రసక్తే లేదని ఉభయ కమ్యూనిస్ట్ పార్టీలు తేల్చి చెప్పాయి. ఇది కేవలం సీట్ల సర్దుబాటు సమస్య కాదు, పార్టీ ఉనికికి సంబంధించిన జీవన్మరణ సమస్యగా వామపక్షాలు భావిస్తున్నాయి. దశాబ్దాలుగా ఎర్రజెండా రెపరెపలాడిన గ్రామాలను మిత్రపక్షం పేరుతో కాంగ్రెస్ కు అప్పగిస్తే, భవిష్యత్తులో అక్కడ పార్టీ కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. అందుకే "ఫ్రెండ్లీ కాంటెస్ట్" పేరుతో కొన్నిచోట్ల భీకర పోరుకు సిద్ధమవుతున్నారు.

**కంచుకోటల్లో 'ఎర్ర' జెండా పట్టు.. తగ్గని కామ్రేడ్ల పట్టుదల**



తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్, రంగారెడ్డి జిల్లాలతో పాటు కొత్తగా ఏర్పడిన భద్రాద్రికొత్తగూడెం, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో కమ్యూనిస్టులకు ఇంకా బలమైన ఓటు బ్యాంకు, పటిష్టమైన క్యాడర్ ఉంది. రాష్ట్ర నాయకత్వం ఆదేశాలు ఎలా ఉన్నా, క్షేత్రస్థాయిలో ఉండే గ్రామ కమిటీలు మాత్రం రాజీకి ససేమిరా అంటున్నాయి. ముఖ్యంగా ఈ జిల్లాల్లోని అనేక గ్రామాల్లో సీపీఎం, సీపీఐలకు దశాబ్దాల చరిత్ర ఉంది. ఇలాంటి చోట్ల కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్నప్పటికీ, అధికారంలో ఉంది కాబట్టి పెత్తనం చెలాయించాలని చూస్తే ఊరుకునేది లేదని ఎర్రసైన్యం హెచ్చరిస్తోంది. అవసరమైతే సీపీఐ, సీపీఎం రెండూ వేర్వేరుగా బరిలోకి దిగి, త్రిముఖ పోరుకు తెరలేపే అవకాశాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఇది అంతిమంగా ఓట్ల చీలికకు దారితీసి, ఫలితాలను తారుమారు చేసే ప్రమాదం లేకపోలేదు.

**చింతకానిలో రగులుతున్న ప్రతీకార జ్వాలలు.. మధిరపై ప్రత్యేక ఫోకస్**

ఈ ఎన్నికల్లో అత్యంత సెన్సేషనల్ పాయింట్ ఏదైనా ఉందంటే అది ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గమే. ఇటీవల చింతకాని మండలంలో సీపీఎం సీనియర్ నేత, సౌమ్యుడు సామినేని రామారావు దారుణ హత్యకు గురవడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనతో స్థానిక కమ్యూనిస్ట్ శ్రేణుల్లో ఆగ్రహజ్వాలలు ఇంకా చల్లారలేదు. ఇది కేవలం ఒక నాయకుడి హత్యగా కాకుండా, తమ పార్టీపై జరిగిన దాడిగా సీపీఎం భావిస్తోంది. ఈ నేపథ్యంలో చింతకాని మండలంతో పాటు మధిర నియోజకవర్గంలో జరిగే సర్పంచ్ ఎన్నికలను సీపీఎం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. "మా నాయకుడిని చంపారు.. ఇప్పుడు మా సత్తా ఏంటో ఓట్ల ద్వారా చూపిస్తాం" అనే కసి కార్యకర్తల్లో కనిపిస్తోంది. ఇక్కడ కాంగ్రెస్ తో పొత్తు ఉన్నా, లేకపోయినా.. సీపీఎం తన సత్తా చాటడానికి సర్వశక్తులూ ఒడ్డనుంది. ఈ పరిణామం అధికార పార్టీకి మింగుడు పడని అంశంగా మారింది.

**లోకల్ డీల్స్.. వ్యూహాత్మక ఎత్తుగడలు**

రాష్ట్ర స్థాయిలో పొత్తులు ఉన్నప్పటికీ, పంచాయతీ ఎన్నికల స్వభావం రీత్యా జిల్లా కమిటీలకు, మండల కమిటీలకు పూర్తి స్వేచ్ఛను ఇస్తూ వామపక్ష అధిష్టానం నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, ఎక్కడైతే పార్టీకి గెలిచే సత్తా ఉందో అక్కడ ఒంటరి పోరు చేస్తారు. ఎక్కడైతే కాస్త బలహీనంగా ఉన్నారో, అక్కడ మాత్రం కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి, బదులుగా వార్డు మెంబర్ల సీట్లు లేదా ఉప సర్పంచ్ పదవుల కోసం బేరసారాలు ఆడుతున్నారు. అలాగే, ఉమ్మడి శత్రువులైన ఇతర పార్టీలు గెలిచే అవకాశం ఉన్నచోట, ఓట్లు చీలకుండా కాంగ్రెస్ తో సర్దుబాటు చేసుకోవాలని నిర్ణయించారు. స్థానిక పరిస్థితులు, గ్రామాభివృద్ధి, సామాజిక సమీకరణాలను బట్టి ఈ నిర్ణయాలు ఎక్కడికక్కడ మారుతూ ఉంటాయి. అంటే ఒక గ్రామంలో మిత్రులుగా ఉన్నవారు, పక్క గ్రామంలోనే బద్ధ శత్రువులుగా తలపడే విచిత్రమైన పరిస్థితి ఈ ఎన్నికల్లో కనిపించబోతోంది.

**అసలు టార్గెట్ ఎంపీటీసీ, జడ్పీటీసీలే.. కింగ్ మేకర్లుగా మారే ఛాన్స్**

సర్పంచ్ ఎన్నికలు కేవలం సెమీఫైనల్స్ మాత్రమేనని, అసలైన ఫైనల్స్ రాబోయే మండల , జిల్లా పరిషత్ ఎన్నికలేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఆ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయి కాబట్టి, సీట్ల పంపకాలు అధికారికంగా ఉంటాయి. ఇప్పుడు సర్పంచ్ ఎన్నికల్లో తమ సత్తా చాటితేనే, రేపు పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎక్కువ సీట్లు డిమాండ్ చేయడానికి అవకాశం ఉంటుందని వామపక్షాలు భావిస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాలను, అనేక మండల పరిషత్ అధ్యక్ష పదవులను డిసైడ్ చేసే శక్తి కమ్యూనిస్టుల చేతిలోనే ఉంది. వారి మద్దతు లేకపోతే ఈ జిల్లాల్లో కాంగ్రెస్ ఏకపక్షంగా స్వీప్ చేయడం అసాధ్యం. అందుకే ఇప్పుడు సర్పంచ్ ఎన్నికల ద్వారా తమ బలాన్ని ప్రదర్శించి, భవిష్యత్తులో "కింగ్ మేకర్లు"గా చక్రం తిప్పాలని సీపీఐ, సీపీఎంలు పక్కా ప్లాన్ తో ముందుకు వెళ్తున్నాయి.

## యానిమేషన్, గేమింగ్, ఫిల్మ్ టెక్ హబ్‌గా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, క్వాంటం సాంకేతికత, కృత్రిమ మేధస్సు, అంకుర సంస్థలు, పర్యాటకం, ఎగుమతులు వంటి రంగాల్లో రాబోయే రెండు దశాబ్దాల్లో వృద్ధిని సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. నీలం & పచ్చని హైదరాబాద్ లక్ష్యంగా మూసీ నది పునరుజ్జీవం, 2959 చెరువులు, పార్కులు, అటవీ ప్రాంతాలను పునరుద్ధరించడం ఇందులో ఉన్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు తరహాలో రీజనల్ రింగ్ రోడ్డు, హైస్పీడ్ రవాణా మార్గాలు, 4 పారిశ్రామిక కారిడార్లు, 11 రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. వరంగల్, నిజామాబాద్, అదిలాబాద్, పెద్దపల్లి, కొత్తగూడెంలో కొత్త విమానాశ్రయాలను కూడా ఏర్పాటు చేయబోతున్నారు. ప్రతి ఏడాది రెండు లక్షల యువతకు, లక్ష మంది నిపుణులకు విదేశీ ఉపాధికి అవసరమైన నైపుణ్య అభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్నారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ కేంద్రాలుగా క్రీడా కేంద్రాలు, మానసిక ఆరోగ్యం, యోగా, ధ్యానం, క్రీడలు, సాంస్కృతిక అవగాహనతో సమతుల్య యువత అభివృద్ధి కోసం సంపూర్ణ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు ప్రణాళిక రూపొందించారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, హైదరాబాద్‌ను రాత్రి ఆర్థిక వ్యవస్థ నగరంగా తీర్చిదిద్దడం, బతుకమ్మ, బోనాలు వంటి పండుగలతో తెలంగాణ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయాలని సంకల్పించారు. ప్రపంచ చలనచిత్ర రంగాన్ని ఆకర్షిస్తూ యానిమేషన్, గేమింగ్ పరిశ్రమలకు తెలంగాణను గమ్యస్థానంగా చేయాలని నిర్దేశించారు. ఈ విధాన పత్రం రాష్ట్రంలోని ప్రతి గ్రామంతో పాటు ప్రపంచ నగరమైన హైదరాబాద్ వరకు సమాన అవకాశాలు, స్థిరమైన అభివృద్ధికి మార్గదర్శకంగా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# కేటీఆర్ అంటేనే ఐరన్ లెగ్

- కేసీఆర్ లేకపోతే నీ ఐడెంటిటీ ఎక్కడిది?
- కేసీఆర్ ఉన్నంత వరకే బీఆర్ఎస్‌లో హరీశ్ రావు
- కేటీఆర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన కామెంట్స్

**స్టేషన్ ఘన్‌పూర్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫైర్ అయ్యారు. వరంగల్ పర్యటన సందర్భంగా కేటీఆర్ తనపై చేసిన వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కడియం శ్రీహరి దమ్ము ఉన్న నాయకుడని.. కేటీఆర్ మాదిరిగా అయ్య అండ చూసుకొని రాజకీయాలు చేయట్లేదని విమర్శించారు. కేసీఆర్ లేకపోతే నిన్ను అడిగేవారెవరు..? కేసీఆర్ లేకపోతే నీ ఐడెంటిటీ ఎక్కడిది..? కేటీఆర్‌ను ప్రశ్నించారు. కడియం శ్రీహరికి కుటుంబ రాజకీయాలు లేవని.. స్వతహాగా ఎదిగొచ్చిన నాయకుడని అన్నారు. విలువలు, నీతి గురించి నువ్వు మాట్లాడుతున్నావా.. గత పదేళ్లలో ఇతర పార్టీల ఎమ్మెల్యేలను మీ పార్టీలో చేర్చుకొని మంత్రి పదవులు ఇచ్చినప్పుడు ఏమైపోయినవి ఈ విలువలు అని ప్రశ్నించారు. ఆ రోజు ఏం పీకుతున్నవ్.. కేసీఆర్ తప్పు అని అప్పుడు ఎందుకు చెప్పలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు నీకు లేదన్నారు. కేటీఆర్ నాయకత్వంపై సందేహాలున్నాయని.. అతడి దగ్గర పని చేయలేకనే కవిత బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లిందన్నారు. కేటీఆర్ అంటేనే ఐరన్ లెగ్ అని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అతడి నాయకత్వంలో పని చేయలేకపోతున్నారని ఆరోపించారు. కేసీఆర్ కోసమే హరీష్ రావు బీఆర్ఎస్ పార్టీలో ఉన్నాడని.. సమయం చూసి హరీష్ రావు కూడా ఆయన దారి ఆయన చూసుకుంటాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీకి కేటీఆర్ నాయకత్వం పనికి రాదని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు తెలుసన్నారు. ఇకనైనా అహంకారం, బలుపుతో మాట్లాడటం మానేయాలని హితవు పలికారు. పెద్ద నాయకునివి కావాలంటే బలుపు, అహంకారం తగ్గించుకోవాలని సూచించారు.

# దీప్తి జాక్‌పాట్ @రూ. 3.2 కోట్లు

- రూ.1.30 కోట్లు పలికిన తెలుగమ్మాయి శ్రీ చరణి
- డబ్ల్యూపీఎల్ వేలంలో భారత క్రికెటర్ల హవా
- అమీలియా కెర్‌ను 3 కోట్లకు కొనుగోలు చేసిన ముంబై ఇండియన్స్

**ఇంటర్నెట్ డెస్క్, మహా:** డబ్ల్యూపీఎల్ 2026 మెగా వేలంలో టీమిండియా ప్లేయర్లు సత్తాచాటారు. 23 మంది విదేశీ క్రికెటర్లతో కలిపి మొత్తం 67 మంది ప్లేయర్లని ఫ్రాంఛైజీలు తీసుకున్నాయి. అన్ని టీమ్‌లు కలిసి రూ.40.8 కోట్లు ఖర్చు చేశాయి. భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మ అత్యధిక ధర పలికారు. ఆమెను 3.20 కోట్లతో యూపీ వారియర్స్ ఆర్‌టీఎం కార్డు ఉపయోగించి తీసుకుంది. న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమేలియా కెర్‌ను రూ.3 కోట్లకు ముంబయి ఇండియన్స్, భారత ఆల్‌రౌండర్ శిఖా పాండేను రూ.2.40 కోట్లకు యూపీ వారియర్స్, కివీస్ సీనియర్ ప్లేయర్ సోఫీ ఎకిల్‌స్టోన్‌ను రూ.2 కోట్లకు గుజరాత్ జెయింట్స్ తీసుకున్నాయి. ఈ మెగా వేలంలో ఏ జట్టు ఎవరిని? ఎంతకు తీసుకుందో ఓ లుక్కేద్దాం.

**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు..**

స్మృతి మంధాన, ఎల్లీస్ పెర్రీ, రిచా ఘోష్, శ్రేయంక పాటిల్ రిటైన్ అయ్యారు. జార్జియా వోల్ (రూ.60 లక్షలు), నాడిన్ డి క్లెర్క్ (రూ.65 లక్షలు), రాధా యాదవ్ (రూ.65 లక్షలు), లారెన్ బెల్ (రూ.90 లక్షలు), లిన్సే స్మిత్ (రూ.30 లక్షలు), ప్రేమ రావత్ (రూ.20 లక్షలు.. ఆర్‌టీఎం), అరుంధతీ రెడ్డి (రూ.75 లక్షలు), పూజా వస్త్రాకర్ (రూ.85 లక్షలు), గ్రేస్ హారిస్ (రూ.75 లక్షలు), గౌతమి నాయక్ (రూ.10 లక్షలు), ప్రత్యూష కుమార్ (రూ.10 లక్షలు), దయాళన్ హేమలత (రూ.30 లక్షలు).

**ముంబయి ఇండియన్స్..**

అమన్‌జోత్ కౌర్, హర్మన్‌ప్రీత్ కౌర్, హేలీ మాథ్యూస్, నాట్ సివర్ బ్రంట్, జి కమలిని రిటైన్ అయ్యారు. అమేలియా కెర్ (రూ.3 కోట్లు), షబ్నమ్ ఇస్మాయిల్ (రూ.60 లక్షలు), సంస్కృతి గుప్తా (రూ.20 లక్షలు), సజీవన్ సజన (రూ. 75 లక్షలు), రహీలా(రూ.10 లక్షలు), నికోలా కారి (రూ.30 లక్షలు), త్రివేణి వశిష్ట (రూ.20 లక్షలు), నల్లా రెడ్డి (రూ.10 లక్షలు), సైకా ఇషాక్ (రూ.30 లక్షలు), మిలీ ఇల్లింగ్‌వర్త్ (రూ. 10 లక్షలు).

**ఢిల్లీ క్యాపిటల్స్..**

జెమీమా రోడ్రిగ్స్, షెఫాలీ వర్మ, మారిజెన్ కాప్, అన్నాబెల్ సదర్లాండ్, నిక్కీ ప్రసాద్ రిటైన్ అయ్యారు. లారా వోల్వార్ట్ (రూ.1.10 కోట్లు), చినెల్లె హెన్రీ (రూ.1.30 కోట్లు), శ్రీ చరణి (రూ.1.30 కోట్లు), స్నేహ్ రాణా (రూ.50 లక్షలు), లిజెల్ లీ (రూ.30 లక్షలు), దీయా యాదవ్ (రూ.10 లక్షలు), తనియా భాటియా (రూ.30 లక్షలు), మమత మడివాలా (రూ.10 లక్షలు), నందినీ శర్మ (రూ.10 లక్షలు), హామిల్టన్ (రూ.10 లక్షలు), మిన్ను మణి (రూ.40 లక్షలు).

**యూపీ వారియర్స్..**

శ్వేతా సెహ్రావత్ రిటైన్ అయింది. దీప్తి శర్మ (రూ.3.2 కోట్లు ఆర్‌టీఎం), సోఫీ ఎకిల్‌స్టోన్ (రూ.85 లక్షలు), మెగ్ లానింగ్ (రూ.1.90 కోట్లు), ఫోబ్ లిచ్‌ఫీల్డ్ (రూ.1.20 కోట్లు), కిరణ్ నవ్‌గిరే (రూ.60 లక్షలు), హర్లీన్ డియోల్ (రూ. 50 లక్షలు), క్రాంతి గౌడ్ (₹ 50 లక్షలు ఆర్‌టీఎం), ఆశా శోభన (రూ.1.10 కోట్లు), డియాండ్రా డాటిన్ రూ.80 లక్షలు), శిఖా పాండే (రూ.2.40 కోట్లు), సిమ్రాన్ షేక్ (రూ.10 లక్షలు), షిప్రా గిరి (రూ.10 లక్షలు), క్లో ట్రయాన్ (రూ.30 లక్షలు), సుమన్ మీనా (రూ.10 లక్షలు), గొంగడి త్రిష (రూ.10 లక్షలు), ప్రతీకా రావల్ (రూ.40 లక్షలు), తారా నోరిస్ (రూ.10 లక్షలు).

**గుజరాత్ జెయింట్స్..**

ఆష్లీగ్ గార్డ్‌నర్, బెత్ మూనీ రిటైన్ అయ్యారు. సోఫీ డివైన్ (రూ.2 కోట్లు), రేణుకా సింగ్ (రూ.60 లక్షలు), భారతి ఫుల్మాలి (రూ.70 లక్షలు), టిటాస్ సాధు (రూ.30 లక్షలు), కష్వీ గౌతమ్ (రూ.75 లక్షలు ఆర్‌టీఎం), కనికా అహుజా (రూ.30 లక్షలు), తనుజా కన్వర్ (రూ. 45 లక్షలు), జార్జియా వేర్‌హమ్ (రూ.కోటి), అనుష్క శర్మ (రూ.45 లక్షలు), హ్యాపీ కుమారి (రూ.10 లక్షలు), కిమ్ గార్త్ (రూ.50 లక్షలు), యాస్తికా భాటియా (రూ.50 లక్షలు), డాని వ్యాట్ హాడ్జ్ (రూ.50 లక్షలు), ఆయుషి సోనీ (రూ.30 లక్షలు), రాజేశ్వరి గైక్వాడ్ (రూ.40 లక్షలు), శివాని సింగ్ (రూ.10 లక్షలు).




# ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

- ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించండి
- ఎన్నికల విధుల్లో ఆరోపణలకు ఆస్కారం ఇవ్వొద్దు: డీజీపీ
- ఎన్నికల నిర్వహణపై పోలీసు అధికారులతో శివధర్ రెడ్డి రివ్యూ

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో జరగబోయే పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిల పోలీస్ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. శివధర్ రెడ్డి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ కమిషనరేట్ మినహా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు మొదలుకొని స్టేషన్ హౌస్ ఆఫీసర్ల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పంచాయతీ ఎన్నికలు సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికలను నిస్పాక్షికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని,ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి భద్రతల అదనపు డీజీపీ మహేష్ ఎం భగవత్, మల్టీ జోన్ 2 అడిషనల్ డీజీపీ డీఎస్ చౌహాన్, మల్టి జోన్ 1 ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఏఐజీ రమణ కుమార్, లీగల్ అడ్వయిజర్ ఇ రాములు, తదితరులు పాల్గొన్నారు.

# రూ. 80 లక్షల తల్లి పెన్షన్ కోసం ఏ కొడుకూ చేయని పని!





తల్లి పెన్షన్ కోసం ఒక కొడుకు ఎవరూ చేయని, చేయకూడని పనికి పూనుకున్నాడు. అలా నాలుగేళ్లు మోసం చేశాడు. చివరికి పోలీసులకు చిక్కాడు. కొడుకు ఘనకార్యం ఏంటి అంటే.. ఉత్తర ఇటలీలోని బోర్గో వర్జిలియో పట్టణానికి చెందిన నర్సు గ్రాజియెల్లా డల్ ఓగ్లియో (85) చనిపోయింది. అయితే ఆమె చనిపోయిందని చెబితే పెన్షన్ రాదేమో ననే భయంతో ఆమె 56ఏళ్లు కొడుకు ఎవరూ ఊహించని పనిచేశాడు చట్టబద్ధంగా తన తల్లి పెన్షన్ రావాలంటే.. తల్లి చనిపోయినట్టు ఎవరికీ తెలియకూడదని ప్లాన్ వేశాడు. అచ్చం ఆమెలాగే వేషం వేసుకుని అందర్నీ నమ్మించడం మొదలు పెట్టాడు. అలా వేషం మార్చుకుని గత మూడేళ్లుగా ఆమె పెన్షన్ పొందుతూ సుమారు రూ. 80 లక్షలు దండుకున్నాడు. అయితే మోసం ఎంతో కాలం దాగదు కదా. 2022లో తన తల్లి మరణించిన తరువాత, ఆమెలానే బ్లౌజ్ ,స్కర్ట్, లిప్‌స్టిక్, విగ్ ధరించేవాడు. అయితే నవంబర్ 16న, ఐడీ కార్డు రెన్యూవల్ కోసం రిజిస్ట్రీ కార్యాలయానికి వెళ్లినపుడు అధికారులకు అనుమానం వచ్చింది. వేషధారణలో ఏదో తేడా ఉందని గమనించారు. ఐడిలోని ఫోటోలో ఉన్న మహిళలాగే కనిపించినప్పటికీ, మెడపై జుట్టు, భారీ మేకప్ నకిలీది అని అర్థం అయింది. దీంతో అతని పెన్షన్ స్కామ్ వెలుగులో వచ్చింది .అలాగే కుటుంబం రియల్ ఎస్టేట్ , భూమి నుండి వచ్చే ఆదాయాన్ని క్లెయిమ్ చేస్తూనే ఉన్నాడు.

**మరి తల్లి శవాన్ని ఏం చేశాడు.**

పోలీసులు కూపీ లాగడంతో తన మారువేషాన్ని అంగీకరించాడు. తన తల్లి సహజంగానే చనిపోయిందని, అది దాచిపెట్టడానికి ఆమె శవాన్ని మమ్మీపై చేసినట్టు ఒప్పుకున్నాడు. దీని ఆధారంగా తనిఖీలు చేపట్టిన అధికారుల ఆమె మృతదేహాన్ని కనుగొన్నారు. నిరుద్యోగి అయిన ఈ ఇటాలియన్ వ్యక్తిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఆ మహిళ సహజ కారణాల వల్ల మరణించి ఉండవచ్చు, కానీ శవపరీక్షలో అసలు విషయం తెలుస్తుందని విచారణ అధికారి అపోర్టి చెప్పారు. ఆ కుటుంబానికి ఎలాంటి ఆర్థిక సమస్యలు లేవు .ఇది చాలా, చాలా విచారకరమైన కథ అని తెలిపారు.



# చైనాలో ఘోర రైలు ప్రమాదం

చైనాలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. రైల్వే ట్రాక్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిపై ట్రైన్ దూసుకెళ్లింది. ఈ ప్రమాద ఘటనలో 11మంది రైల్వే సిబ్బంది అక్కడికక్కడే మృతిచెందగా, ఇద్దరికి గాయాలయినట్లు ఆ దేశ మీడియా కథనాలు పేర్కొన్నాయి. స్థానిక కాలమానం ప్రకారం.. గురువారం చైనాలోని యున్నాన్ ప్రావిన్స్ కున్మింగ్ నగరంలో ఘోరరైలు ప్రమాదం జరిగింది. భూకంపాల గుర్తింపును పరీక్షిస్తున్న ఒక టెస్ట్ ట్రైన్, రైలు ట్రాక్ పై విధులు నిర్వహిస్తున్న రైల్వే సిబ్బందిపై పట్టాలు తప్పి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 11 మంది కార్మికులు అక్కడికక్కడే మృతిచెందారని, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని ఆ దేశ మీడియా సంస్థలు తెలిపాయి. దీంతో ఈ ప్రమాద ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు.ఈ రైలు ప్రమాదం దశాబ్ద కాలంగా చైనాలో జరిగిన రైలు ప్రమాదాలలో అతి పెద్దదని ఆ దేశ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2011లో చివరిసారిగా ఒక భారీ ట్రైన్ ప్రమాదం జరిగిందని ఆ ఘటనలో 40 మంది మృతిచెందగా 200 మందికి పైగా ప్రజలు గాయపడ్డట్లు అక్కడి మీడియా సంస్థలు వెల్లడించాయి.

# రాష్ట్ర ప్రయోజనాలే కీలకం





- కేంద్రంపై పోరాటానికి ఐక్యత
- ఎంపీలతో భట్టి విక్రమార్క సమీక్ష
- పెండింగ్ అంశాలపై అన్ని పార్టీల ఎంపీలతో డిప్యూటీ సీఎం రివ్యూ

**హైదరాబాద్, మహా:** ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎంపీలతో రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఈ సమావేశాన్ని నిర్వహించినట్టు ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం తొమ్మిదవ షెడ్యూల్‌లో సవరణ అత్యవసరమని గుర్తించి, ఈ అంశాన్ని పార్లమెంటులో అడ్జర్న్‌మెంట్ మోషన్ లేదా ప్రశ్నోత్తరాల ద్వారా బలంగా ముందుకు తీసుకెళ్లాలని ఎంపీలకు సూచించారు. అన్ని పార్టీల ఎంపీలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్తు రాష్ట్ర కేబినెట్‌తో కలిసి, ప్రధానమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో పార్లమెంట్ సమావేశాల సమయంలో ఎంపీలకు అవసరమైన సమాచారాన్ని తక్షణం అందించేందుకు ఢిల్లీలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు; ఇందులో విద్యుత్, నీటిపారుదల, ఎస్జీటీ తదితర శాఖలకు సంబంధించిన పెండింగ్ నిధుల వివరాలు సిద్ధంగా ఉంటాయన్నారు. కేంద్రానికి సంబంధించిన 12 శాఖలపై 47 పెండింగ్ అంశాలను గుర్తించి, సెమికండక్టర్ రంగంపై కూడా చర్చించినట్లు పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షలో డిసెంబర్ 9న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తిచేయనున్న సందర్భంగా ప్రభుత్వ విజయాలు, విజన్ 2047 డాక్యుమెంట్‌ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని చేరుకునేందుకు గల ప్రణాళికను కూడా సమగ్రంగా సిద్ధం చేసినట్టు తెలిపారు. ఈ ఆర్థిక ప్రణాళికను పటిష్టం చేయడంలో మరియు గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించిన కమిటీలలో ఆసక్తి ఉన్న ఎంపీలు చేరాలని ఆయన ఈ సందర్భంగా సూచన చేశారు.

# శబరిమల భక్తులకు శుభవార్త..

## అన్నదానంలో ఇకపై కేరళ సద్య వడ్డన!

- మెనూను మార్చిన ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు
- అన్నదానంలో భారీ మార్పులు చేసిన టీడీబీ
- భక్తుల విరాళాలకు విలువిస్తూ.. సంప్రదాయ రుచులతో కొత్త మెనూ సిద్ధం!
- ఆసియాలోనే అతిపెద్ద అన్నదాన భవనంలో ఇక పసందైన విందు..
- రోజుకు 10 వేల మందికి భోజనం




**హైద్రాబాద్,మహా:** మండల, మకరవిళక్కు సీజన్ వేళ శబరిమల అయ్యప్ప భక్తులకు ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు తీపి కబురు చెప్పింది. స్వామి వారి దర్శనం కోసం కఠిన దీక్షలతో వచ్చే భక్తులకు అందించే అన్నదానం మెనూలో సమూల మార్పులు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటివరకూ అమలులో ఉన్న సాదారణ మెనూ స్థానంలో, నోరూరించే సంప్రదాయ వంటకాలను వడ్డించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన భోజనం అందనుంది శబరిమల క్షేత్రంలో అయ్యప్ప భక్తుల ఆకలి తీర్చే అన్నదాన కార్యక్రమం ఇకపై కొత్త రుచులతో సాగనుంది. ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు కొత్తగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా బోర్డు సమావేశంలో అన్నదానం మెనూను పూర్తిగా మారుస్తున్నట్లు బోర్డు నూతన అధ్యక్షుడు కె. జయకుమార్ అధికారికంగా వెల్లడించారు. ఇప్పటివరకు మధ్యాహ్న భోజనంలో కేవలం వెజ్ పులావ్, సాంబార్ మాత్రమే అందిస్తుండగా, ఇకపై వాటి స్థానంలో పూర్తిస్థాయి కేరళ సంప్రదాయ భోజనమైన 'సద్య'ను వడ్డించనున్నారు. ఈ కొత్త మెనూలో రుచికరమైన పాయసం, అప్పడాలు, ఇతర సంప్రదాయ వంటకాలు ఉండటం విశేషం.

అన్నదానం కోసం ఖర్చు చేస్తున్నది దేవస్వం బోర్డు సొంత డబ్బు కాదని, అది తోటి భక్తులకు మంచి జరగాలని కోరుకుంటూ భక్తులు సమర్పించిన పవిత్రమైన విరాళమని ఆయన గుర్తుచేశారు. అందుకే ఆ విరాళాలకు సరైన న్యాయం చేస్తూ, భక్తులకు అత్యుత్తమమైన భోజనాన్ని అందించాలనే సదుద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నాణ్యమైన పదార్థాలతో సంప్రదాయ కేరళ భోజనాన్ని అందించే ఈ విధానం త్వరలోనే అమల్లోకి రానుంది. అంతేకాకుండా, పంబలో కూడా అన్నదానం సేవలను మరింత మెరుగుపరచడానికి, యాత్రికుల కోసం ఒక సమగ్ర మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నామని, దీనిపై డిసెంబర్ 18న ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. మండలమకరవిళక్కు సీజన్ కావడంతో ప్రస్తుతం శబరిమలకు భక్తుల తాకిడి విపరీతంగా పెరిగింది. వేలాదిగా తరలివస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శనం మరియు అన్నదాన ఏర్పాట్లు సజావుగా సాగుతున్నాయి. ఆలయం వెనుక భాగంలో ఉన్న మాలికాపురంలోని అన్నదాన భవనం ఆసియాలోనే అతిపెద్ద వాటిలో ఒకటిగా పేరుగాంచింది. ఇక్కడ ప్రతిరోజూ పది వేల మందికి పైగా భక్తులకు ఉచితంగా భోజనం పెడుతున్నారు. ఈ సీజన్‌లో ఇప్పటికే లక్ష మందికి పైగా భక్తులు అన్నదానాన్ని స్వీకరించడం విశేషం. భారీ సంఖ్యలో భక్తులు వస్తుండటంతో పరిశుభ్రత విషయంలో కూడా అధికారులు రాజీపడటం లేదు. అన్నదానం విభాగంలో మొత్తం 235 మంది సిబ్బంది అహర్నిశలు పనిచేస్తున్నారని స్పెషల్ ఆఫీసర్ సునీల్ కుమార్ తెలిపారు. భోజనం చేసిన తర్వాత ప్లేట్లు, గ్లాసులను శుభ్రం చేయడానికి అత్యాధునిక డిష్‌వాషర్లను వినియోగిస్తున్నారు. వేడినీటితో వీటిని శుభ్రపరచడం ద్వారా పరిశుభ్రతను పాటిస్తున్నారు. మొత్తానికి బోర్డు తీసుకున్న ఈ కొత్త మెనూ నిర్ణయం, అయ్యప్ప భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు మంచి ఆతిథ్యాన్ని కూడా అందించనుందని చెప్పవచ్చు.

# ఇమ్రాన్ ఆరోగ్యంపై అడియాలా జైలు ప్రకటన



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ తెహ్రీక్ ఈ ఇన్సాఫ్ (పీటీఐ) వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై వస్తున్న వదంతులను అడియాలా జైలు అధికారులు ఖండించారు. జైలులో ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు. ఆయనకు అవసరమైన వైద్య సంరక్షణ, పర్యవేక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆగస్టు 2023 నుండి నిర్బంధంలో ఉన్న ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం విషయంలో పలు వదంతులు వ్యాపిస్తున్న నేపథ్యంలో అడియాలా జైలు అధికారులు ఈ ప్రకటన చేశారు. తన సోదరుడిని కలిసేందుకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఇమ్రాన్ ఖాన్ సోదరి అలీమా ఖాన్ జైలు సమీపంలో ధర్నా నిర్వహించారు. తన సోదరుడిని చట్టవిరుద్ధంగా నిర్బంధించారని ఆమె ఆరోపించారు. ఈ నిరసన కారణంగా అడియాలా జైలు రోడ్డులో తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అయితే ఇమ్రాన్ కుటుంబ సభ్యులకు వచ్చే మంగళవారం అతనిని కలిసేందుకు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ఇదేవిధంగా పార్టీ అంతర్గత వ్యవహారాలను చర్చించేందుకు పీటీఐ నేతలకు ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతినిచ్చారు. దీంతో ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది, పీటీఐ సెక్రటరీ జనరల్ సల్మాన్ అక్రమ్ రాజా తదితరులు జైలులో ఇమ్రాన్ ఖాన్‌ను కలుసుకోనున్నారు. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై వస్తున్న వదంతులను జైలు అధికారులు ఖండించినప్పటికీ, ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులు మాత్రం ఆయన ఆరోగ్య పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోర్టు ఆదేశాలు ఉన్నా కుటుంబ సభ్యులపై జైలు అధికారుల ఆంక్షలు విధిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

## ఢిల్లీలో తెలంగాణ ఈగల్ టీం

# బిగ్ ఆపరేషన్




**హైదరాబాద్/ఢిల్లీ:** తెలంగాణ ఈగల్ టీమ్ దేశ రాజధానిలో గురువారం భారీ ఆపరేషన్ చేపట్టి సూపర్ సక్సెస్ అయ్యింది. ఏకకాలంలో పలు చోట్ల సోదాలు నిర్వహించి.. 50 మందిని అదుపులోకి తీసుకుంది. వీళ్లంతా నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్న నైజీరియన్లని తేలింది. ఢిల్లీ పోలీసుల (సీసీఎస్) సహకారంతో తెలంగాణ ఈగల్ టీం ఈ స్పెషల్ ఆపరేషన్ నిర్వహించింది. వంద మంది స్థానిక పోలీసులు, 124 మంది ఈగల్ టీం సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. సుమారు 20 ప్రాంతాలలో సోదాలు జరిపింది. తనిఖీల్లో డ్రగ్ కింగ్‌పిన్, డ్రగ్ సేల్ గర్ల్స్, సెక్స్ వర్కర్స్, మ్యూల్ అకౌంట్ హోల్డర్లు పట్టుబడ్డారు. వీళ్ల నుంచి భారీగా మత్తు పదార్థాలు, డబ్బు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. డ్రగ్ ఫ్రీ తెలంగాణ లక్ష్యంగా ఈగల్ టీం వరుసగా మెరుపు దాడులు చేస్తోంది. ఈ క్రమంలో ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు లింకుల నేపథ్యంలోనే తాజా ఆపరేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది. ఢిల్లీలో పాటు గ్రేటర్ నోయిడా, గ్వాలియర్, విశాఖలోనూ స్థానిక పోలీసుల సహకారంతో అంతరాష్ట్ర ఆపరేషన్స్ చేపట్టినట్లు సమాచారం.


రాజీలేని జర్నలిజం
ఏఎన్ఎన్ నైజం
ఏఎన్ఎన్
స్కాన్ చేయండి.. సబ్‌స్క్రైబ్ చేయండి
SUBSCRIBE
TELUGU
www.annelugu.com
https://epaper.mahaadaily.com/

# నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

**మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా:** 2 వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ కోరారు. గురువారం లక్షెట్టిపేట మండలంలోని గుల్లకోట, మిట్టపల్లి, సూరారం గ్రామాలకు గుల్లకోట గ్రామపంచాయతీ, పోతపల్లి, అంకతిపల్లి, లక్ష్మీపూర్ గ్రామాలకు పోతపల్లి గ్రామపంచాయతీ, చందారం, హనుమంతుపల్లి, రంగపేట గ్రామాలకు చందారం గ్రామపంచాయతీ లో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు చేపట్టిన నామినేషన్ స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో 3 విడతలలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా మొదటి విడతలో 90 సర్పంచ్, 816 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నామినేషన్ స్వీకరణ కేంద్రం ముందు గ్రామపంచాయతీలోని వార్డుల వారీగా ఫోటో ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల వివరాలను ప్రకటించాలని అన్నారు. నామినేషన్ కేంద్రం నుండి 100 మీటర్ల పరిధిలో గుంపులుగా ఎవరిని అనుమతించకూడదని, నామినేషన్ సమర్పించే అభ్యర్థులు, ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణలో ఎన్నికల కమిషన్ జారీ చేసిన నియమాలకు లోబడి వ్యవహరించాలని వివరించారు. నామినేషన్ పత్రాల స్వీకరణ, నామినేషన్ల పరిశీలన, అభ్యర్థుల ప్రకటన, గుర్తుల కేటాయింపు ప్రక్రియలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం ఇటిక్యాల గ్రామంలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేపట్టిన పోస్ట్ మార్టం గది నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సరోజ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొలనుపాకలో ఎన్నికల నామినేషన్ ప్రక్రియ పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను గురువారం జిల్లా కలెక్టర్ హనుమంత రావు పరిశీలించారు. ఎన్నికల కోడ్ నియమావళిలో నామినేషన్ పత్రాలు స్వీకరించాలని. నామినేషన్ వేసే ప్రక్రియ లో అభ్యర్థులకు ఏమైనా సందేహాలు నివృత్తి చేసుకోవడానికి హెల్ప్ డెస్క్ ఉపయోగించుకోవాలని సూచించారు.

# ఆర్వో, ఏఆర్వోలకు శిక్షణ



**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రంలోని జెడ్పీ హై స్కూల్లో గురువారం ఆర్వోలు , ఏ ఆర్వో లోకి గ్రామపంచాయతీ ఎన్నికల పై శిక్షణ తరగతుల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంత రావు పాల్గొన్నారు జిల్లా లో గ్రామ పంచాయితీ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని. ఇప్పటివరకు మీరు అందరూ ఎన్నో ఎలక్షన్స్ లో పాల్గొని ఉంటారు. ఈ ఎలక్షన్స్ ని కూడా సజావుగా అయ్యేలా చూడాల్సిన బాధ్యత ఆర్వో లు , ఏఆర్వో లపై ఉంటుంది అన్నారు.

# అభివృద్ధిలో వేములకొండను ముందంజలో నిలుపుతా...

**ఏర్పుల వెంకటేశం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి**



**వలిగొండ, మహా:** వలిగొండ మండలంలోని వేములకొండ గ్రామానికి చెందిన ఏర్పుల వెంకటేష్ రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు అవకాశం ఇచ్చి తనను గెలిపిస్తే ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి గత కొన్ని సంవత్సరాలుగా సేవలందించానని తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినందున తనను గెలిపిస్తే గ్రామాభివృద్ధికి కావలసిన నిధులు తీసుక రావాడానికి మరింత సులభంగా ఉంటుందని తెలిపారు. ప్రజలందరితో కలుపుకుపోయే గుణం ఉందని మీరంతా నన్ను ఆశీర్వదిస్తే సర్పంచిగా మీ ఇంటి కొడుకుల మీ ఇంటి బిడ్డల మీకు సేవ చేస్తానని ఆయన అన్నారు గ్రామాన్ని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తే వేములకొండను అభివృద్ధి చేస్తానని ధీమా వ్యక్తం చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు




**యాదగిరిగుట్ట, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో ఐ కేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక గురువారం నాడు జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆకస్మిక తనిఖీ చేశారు ఈరోజు ఎన్ని లారీలు వచ్చాయని, ఎంత ధాన్యం కాంటా చేశారని అడిగి తెలుసు కున్నారు.ఇంకా ఎంత ధాన్యం ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈరోజు తేమశాతం వచ్చిన ఆరోజు కొనుగోలు చేసి లారీ లోడ్ చేసి వెంటనే టాబ్ ఎంట్రీ పూర్తి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మీడియా సెంటర్ ప్రారంభించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**యాదాద్రి భువనగిరి, మహా:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లో మీడియా సెంటర్ ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలసి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా మీడియా సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల లో పోటీ చేసే అభ్యర్థుల పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం పై మీడియా సెంటర్ ద్వారా నిఘా పెట్టడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడతగా 6 మండలాల్లో 153 గ్రామ సర్పంచులు 1286 వార్డులు నెంబర్ల లకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మొత్తం మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని అందుకు సంబంధించిన ఏర్పాటు కూడా పూర్తి చేశామని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయితీ రిటర్నింగ్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామినేషన్ వేసే సమయంలో ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు.నామినేషన్ వేసే అభ్యర్థి కొత్త అకౌంట్ ఓపెన్ చేయాలని వారి ఎన్నికల ఖర్చు మొత్తం ఆ ఖాతా నుండి జరపాలని సూచించారు. ఇప్పటికే జిల్లాలో మొదటి విడత ఎన్నికల విధుల్లో పాల్గొని ఆర్వోలకు, ఏఆర్వోలకు, సిబ్బందికి శిక్షణ తరగతులు పూర్తి అయ్యాయని తెలిపారు. రెండో విడతలో పాల్గొని వారికి ఈరోజు నుండి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా వారందరికీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.జిల్లాలోని ప్రజలందరూ కూడా ఎన్నికల కోడ్ లోని నియమ నిబంధనలు పాటించాలన్నారు .రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జిల్లాలో కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు.సర్పంచ్ , వార్డు సభ్యుల పదవులను వేలం ద్వారా దక్కించుకోవాలని చూసిన , ప్రయత్నించిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



## డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శంషాబాద్ నుండి కాచారం వెళ్లి మార్గం మధ్యలోని రాల్లగూడ వద్ద ప్రవేట్ స్కూల్ కాలేజ్ బస్సులను ట్రాఫిక్ సీఐ ప్రమోద్ కుమార్ డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ ట్రస్ట్ నిర్వహించారు. మధ్యకాలంలో జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ పోలీసులు శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు రహదారిలలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు.



## శంషాబాద్ గ్రామాలలో నామినేషన్‌ల సందడి

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ మండలపరిధిలో సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు నామనేషన్ నేపథ్యంలో 21 గ్రామపంచాయతీలకు 7 సెంటర్లను క్లస్టర్లుగా విభజించారు. కస్టర్ల దగ్గర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకుల, నర్కుడా, మల్కారం, చౌదర్ గూడా గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. శనివారం చివరి తేదీ కావడంతో భారీ ర్యాలీగా వచ్చి మరో సేటు వేస్తామని సర్పంచ్ అభ్యర్థులు తెలిపారు.

**అభ్యర్థుల నామినేషన్ కి అధికారుల మెలిక...**

సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ ఫారంకు అధికారులు సహకరించడం లేదని వాపోయారు. చదువుకోని వ్యక్తులు సర్పంచ్ అభ్యర్థిత్వానికి అర్హులు కాదా అంటూ ప్రశ్నించారు. అధికారులు పూర్తి ఫారం నింపిస్తేనే తీసుకుంటాము. ఫారంలో నింపడానికి అధికారులు సహకరించడం లేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలా ఫారం నింపాలనే బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పై అధికారులు నామినేషన్ ప్రక్రియకు సర్పంచ్ అభ్యర్థులకు సహకరించాలని కోరారు.



## చంద్రమౌళీశ్వర నూతన ఆలయ నిర్మాణానికి భూమి పూజ

**ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రంగారెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** గురువారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని, రాగన్న గూడ లక్ష్మిమెగా టౌన్ షిప్ లో శ్రీ కోదండరామ చంద్రమౌలిశ్వర స్వామి దేవాలయాల నిర్మాణానికి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణాన్ని వీలైనంత తొందరగా పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆ యొక్క కోదండరామ చంద్రమౌళీశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు, లక్ష్మీమెగా టౌన్ షిప్ కాలనీవాసులు పలువురు పాల్గొన్నారు.




## గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సమావేశం

**ఆదిలాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ముందు గ్రామపంచాయతీ ఎన్నికలలో సత్తా చాటాలని కాంగ్రెస్ నాయకులు డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. గురువారం కంది శ్రీనివాస రెడ్డి ఆదేశాలతో ఆయన క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ లో ఆదిలాబాద్ రూరల్ , మావల, సాత్నాల మండలాల పరిధిలోని గ్రామపంచాయితీల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రానున్న ఎన్నికలకు ఇవి పునాది వంటివని ఇక్కడ బలంగా తయారై ఎన్నికల్లో విజయం సాధిస్తే అదే ఊపుతో మిగతా ఎన్నికలలో కూడా సత్తా చాటేందకు దోహదపడతాయన్నారు. పంచాయతీలలో పార్టీ మద్దతుతో ఎవరు పోటీ చేసినా గ్రామంలోని మిగతా కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గెలుపుకోసం సహకరించాలన్నారు.గెలుపే లక్ష్యంగా అంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మూడు మండలాలలోని ఆయా గ్రామపంచాయితీలలో సర్పంచ్, వార్డ్ మెంబర్ల కు పోటీపడే అభ్యర్థులకు నామినేషన్ విషయంలో తగు దిశానిర్దేశం చేసారు.ఆశావహులు గ్రామాల వారీగా తమ పేర్లు కార్యాలయంలో నమోదు చేయించుకున్నారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు, కొండ గంగాధర్, లోక ప్రవీణ్ రెడ్డి , గుడిపల్లి నగేష్ , శ్రీలేఖ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఆదిలాబాద్ రూరల్, మావల, సాత్నాల మండలాలకు చెందిన ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళి ఉల్లంఘించవద్దు-ఎస్పీ




**ఆదిలాబాద్ మహా :** స్థానిక గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీస్ శాఖ పూర్తి సంసిద్ధమై ఉన్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు అనుసరించాలని సూచించారు. ఎన్నికలలో ప్రభావితం చేసే, ఎన్నికలలో సమస్యలు సృష్టించే వారిని ముందుగానే గుర్తించి బైండోవర్ చేయాలని సూచించారు. గ్రామాలలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ఎన్నికల రోజు ప్రత్యేకంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. ముఖ్యంగా ఎలాంటి సమాచార వ్యవస్థ సాధ్యం గాని ప్రదేశాలలో షాడో జోన్ లలో ప్రత్యేకంగా కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా విహెచ్ఎఫ్ సెట్లను వినియోగించాలని సూచించారు. అత్యధిక జనాభా ఉన్న గ్రామ పంచాయతీల నందు బైక్ పెట్రోలింగ్ ద్వారా గస్తీ నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎస్ ఎస్ టి మరియు ఎఫ్ ఎస్ టి బృందాలను నెలకొల్పినట్టు ఎలాంటి సమాచారం ఉన్న వారికి తెలియజేయాలని తెలిపారు. 50 వేల కంటే ఎక్కువగా నగదు తరలించే సమయంలో సరైన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. మండలంలో అన్ని గ్రామాలను కలిసి ఉండేలా రూట్ మొబైల్ లను ఏర్పాటు చేయాలని తెలిపారు. 100 మీటర్ల లోపు 20 మీటర్ల లోపు ఉన్న నియమ నిబంధనలు పాటించేలా, ఎలాంటి ర్యాలీలు సభలు ఉన్న అనుమతులు తీసుకునేలా అవగాహన కల్పించాలి. ప్రజలకు నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణ జరిగేలా పట్టిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు కాజల్ సింగ్ ఐపీఎస్, బి సురేందర్ రావు, ఎఎస్పి పి మౌనిక ఐపిఎస్, డీఎస్పిలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్రవర్ధన్,జిల్లా సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్ హెచ్ ఓలు, కమ్యూనికేషన్, డిసిఆర్బి, ఎస్ఐబి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ

**సాయిని యాదగిరి, బీసీ సంఘం మండల అధ్యక్షులు**



**వలిగొండ, మహా :** బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని వలిగొండ మండల బీసీ సంఘం అధ్యక్షులు సాయిని యాదగిరి అన్నారు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని మేనిఫెస్టోలో మరియు కామారెడ్డి డిక్లరేషన్లో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ 17% రిజర్వేషన్ కూడా నేడు బీసీలకు ఇవ్వలేదు అని ఆయన అన్నారు. గత రెండు సంవత్సరాలుగా గ్రామాలను అభివృద్ధి చేయని కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలలో ఓటు అడిగే హక్కు లేదన్నారు కాంగ్రెస్ పార్టీ పైన బీసీలు అంత ఆగ్రహంతో ఉన్నారని ఆయన అన్నారు

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ హనుమంతరావు



**యాదగిరిగుట్ట, మహా:** గ్రామ పంచాయతి ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ లో భాగంగా జిల్లాలో తొలి విడత సర్పంచ్, వార్డు స్థానాలకు , నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు. గురువారం యాదగిరిగుట్ట మండలం మాసాయి పేట గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు ఆకస్మికంగా సందర్శించి, అందుబాటులో ఉన్న సదుపాయాలు పరిశీలించారు. నామినేషన్ పత్రాల స్వీకరణకు చేసిన ఏర్పాట్లు గమనించి పలు సూచనలు చేశారు. హెల్ప్ డెస్క్, వీడియోగ్రఫీ, పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించారా అని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్ లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ, జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, పై అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గోపరాజుపల్లిలో హోరాహోరీ

**ఎస్సీ జనరల్ సీటులో ఆసక్తికరంగా మారిన సర్పంచ్ ఎన్నికలు**




**వలిగొండ, మహా:** తెలంగాణలో స్థానిక ఎన్నికల హడావుడి మొదలయింది. నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంది. ఎన్నికల బరిలో నిలిచేందుకు యువత ఉత్సాహం చూపుతోంది. గోపరాజు పల్లి లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు ఎవరికివారు వారివారి స్థాయిల్లో పైరవీలు చేస్తున్నారు. బరిలో నిలిచి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేలా ఆల్రెడీ ప్రయత్నాలు స్టార్ట్ చేశారు. యువత ఆకట్టుకునేందుకు దావతులు ఇస్తున్నారు.

# నిర్భయంగా ఫిర్యాదు చేయండి

**జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల పరిశీలకులు**

**నిర్మల్ మహా :** నిర్మల్ జిల్లాలో మూడు దశల్లో నిర్వహించబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే ప్రజలు తమను సంప్రదించవచ్చునని జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అటవీ శాఖ వసతి గృహం నందు తాము అందుబాటులో ఉంటామని, ఎన్నికలపై ఫిర్యాదులను ఇవ్వాలనుకున్నవారు నేరుగా సంప్రదించి, ఫిర్యాదులు ఇవ్వవచ్చన్నారు. లేదా 9959284786 ఫోన్ నెంబర్ ద్వారానైనా ఫిర్యాదులపై సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. observergpnirmal@gmail.com మెయిల్ ఐడి ద్వారానైనా ఫిర్యాదులను వ్యక్తపరచవచ్చునని వివరించారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ఫిర్యాదులను నిర్భయంగా ఇవ్వవచ్చునని జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల పరిశీలకులు ఆ ప్రకటనలో తెలిపారు.



# ఫిర్యాదులు, సమాచారం కోసం కంట్రోల్ రూమ్

**మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా:** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికలు 2025 నేపథ్యంలో ఎన్నికల నిర్వహణపై ఫిర్యాదులు, సమాచారం కొరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం మొదటి విడత ఎన్నికలలో 90 సర్పంచ్, 816 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. పారదర్శకమైన ఎన్నికల నిర్వహణ కొరకు ఫ్లయింగ్, స్టాటిస్టిక్, వీడియో సర్వేయలెన్స్ బృందాలు, ఎం సి ఎం సి, ఎం సి సి, ఇతర ఎన్నికల సంబంధిత పర్యవేక్షణ బృందాలను, ఎన్నికల అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలను ప్రలోభపెట్టే నగదు, మద్యం, కానుకల పంపిణీ, ప్రచారం, అక్రమ నగదు రవాణా, ఇతర ప్రభావిత అంశాలపై నిఘా నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ అంశాలు ఎన్నికల జరుగుతున్న ప్రాంతాలలో మీ మీ దృష్టికి వస్తే కంట్రోల్ రూమ్ నం.08736 250501 లో ఫిర్యాదు చేయాలని సూచించారు.



## పంచాయతీ ఎన్నికలపై బోథ్ కాంగ్రెస్ సమావేశం

**బోథ్ మహా:** బోథ్ నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ మద్దతిచ్చిన అభ్యర్థులు గెలిచేలా ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ పిలుపునిచ్చారు. గురువారం ఇచ్చోడ, సిరికొండ మండల పార్టీ కార్యాలయాలలో ఆయా మండలాల పరిధిలోని గ్రామాల నాయకులతో సమావేశమయ్యారు. ప్రజల అభివృద్ధి, గ్రామాల పురోగతి మన లక్ష్యం అని స్పష్టం చేశారు. అలాగే ఎకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షలతో పాటు అదనంగా రూ.10 లక్షలు కేటాయించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పంచాయతీ ఎన్నికల వ్యూహం, అభ్యర్థుల ఎంపిక, పార్టీ విధి విధానాలపై విస్తృతంగా చర్చించారు.ఈ కార్యక్రమంలో ఇచ్చోడ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సత్యవతి కోటేశ్వర్, ఇచ్చోడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కళ్యాం నారాయణ రెడ్డి, సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ ఇమామ్, సీనియర్ నాయకులు, వివిధ మండల నాయకులు, గ్రామ స్థాయి నాయకులు, అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తెలంగాణ దీక్ష దివాస్ ను ఘనంగా నిర్వహించుకుందాం

**బీ.ఆర్.ఎస్. మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్**

**మంచిర్యాల, మహా :** ఈనెల 29 న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న దీక్ష దివాస్ కార్యక్రమాన్ని మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పెద్దపల్లి మాజీ ఎంపీ, చెన్నూరు ఎమ్మెల్యే, భారత రాష్ట్ర సమితి జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, గ్రామాల వారిగా దీక్ష దివాస్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# గ్రామ పంచాయితీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహిద్దాం

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**




**వరంగల్ మహా;** త్వరలో నిర్వహింబడే గ్రామ పంచాయితీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాల్సిందిగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులకు పిలుపు నిచ్చారు. నెలవారి నేర సమీక్షా సమావేశంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కు చెందిన పోలీస్ అధికారులు పాల్గన్న ఈ సమావేశంలో ముందుగా త్వరలో మూడు విడతలు జరగబోయే పంచాయతీ ఎన్నికలను సజావు నిర్వహించేందుకు గాను తీసుకోవాల్సిన ముందస్తు చర్యల పై పోలీస్ కమిషనర్ అధికారులతో చర్చించారు. పోలీస్ స్టేషన్ల వారిగా ఎన్నికలు జరిగే గ్రామ పంచాయితీల వివరాలతో పాటు సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, గ్రామాల వివరాలను పోలీస్ కమిషనర్ సంబంధించిన స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి పోలీస్ అధికారి ప్రణాళికబద్ధంగా పనిచేయాల్సి ఉంటుందని ఎన్నికల వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు ముందస్తూ చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని నామినేషన్ మొదలుకొని ఎన్నికలు ముగిసే వరకు పోలీస్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందని సరైన రీతిలో బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గతంలో ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన నేరస్తుల తో పాటు, ఎన్నిక సమయంలో నేరాలకు పాల్పడేవారు, పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులను బైండోవర్ చేయాలని, ఎన్నికలు జరిగే గ్రామాలకు పోలీస్ అధికారులు నిరంతరం సందర్శిస్తూ ఎన్నికలను సజావుగా కొనసాగేందుకుగా స్థానిక గ్రామస్తులతో సమన్వయం చేసుకోవాలని. ప్రధానంగా ఎన్నికలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తుండంతో పక్క జిల్లాల నుండి బందోబస్తు విధులు నిర్వహించేందుకు పోలీస్ సిబ్బంది రావడం వుండదని, కావున ప్రస్తుతం మనకు అందుబాటులో వున్న పోలీస్ సిబ్బంది వినియోగించుకోని అధికారులు ఎన్నికల బందోబస్తు నిర్వహించుకోవాలని, పోలీస్ స్టేషన్ పరిధిలోని లైసెన్స్ కలిగిన అయుధ యజమానులు తమ తుపాకులను సమీప పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేసే విధంగా స్టేషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ అధికారులను అదేశించారు. అనంతరం పెండిగ్ కేసులు, నిందితుల అరెస్టులు, నేరాల నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలు మొదలైన అంశాలపై పోలీస్ కమిషనర్ అధికారులతో సమీక్షా జరిపారు. ఈ సమావేశంలో డిసిపిలు అంకిత్ కుమార్, రాజమహేంద్ర నాయక్, ధార కవిత, ఏ.ఎస్పీలు శుభం, చైతన్య, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్, బాలస్వామి, సురేశ్‌కుమార్, శ్రీనివాస్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఆర్.ఐలు, ఎస్.ఐలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# జేసిబిలు, సక్కింగ్ మిషన్ వినియోగానికి షెడ్యూలు రూపొందించాలి

**నగర మేయర్ గుండు సుధారాణి**



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరం లోని 66 డివిజన్ లలో జేసిబి ల, సక్కింగ్ మిషన్ల వినియోగానికి షెడ్యూలు రూపొందించాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం బాల సముద్రంలో బల్దియా నిర్వహిస్తున్న వెహికల్ షెడ్ ను కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి క్షేత్ర స్థాయిలో సందర్శించి సమర్థ వంతంగా చేపట్టుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ లో భాగం గా బల్దియా పరిధి లో రెండు సర్కిల్ ల వారిగా 6 జే సి బి వాహనాలు అందుబాటులో ఉంచి కనీసం ప్రతి 15 రోజులకు ఒకసారి ఒక డివిజన్ లో ప్రత్యేకంగా వినియోగానికి చర్యలు చేపట్టాలని తద్వారా కార్పొరేటర్ లు వారి డివిజన్ లలో శానిటేషన్ పనుల నిర్వహణకు అందుబాటు లో ఉండేలా చూడాలని తెలిపారు. కార్పొరేటర్ లకు ఈ సమాచారాన్ని అందజేయాలని అన్నారు. సక్షన్ వాహనానికి షెడ్యూలు రూపొందించి నీరు నిలిచివుండే ప్రాంతాల్లో ఈ యంత్రం ద్వారా తొలగింపు చేపట్టేలా చూడాలని ఇట్టి వాహన కదలికలు ఐసిసిసికి అనుసంధించాలని అన్నారు. డంప్ యార్డ్, ట్రాన్స్ఫర్ స్టేషన్ లలో పంక్చర్ యూనిట్ ఏర్పాటు చేయాలని అన్నారు. చెత్త తరలింపు వాహనాలు ఎక్కడైనా ఆకస్మాత్తుగా బ్రేక్ డౌన్ ఐతే వాటికి మరమత్తులు చేపట్టడానికి ఒక మొబైల్ వాహనాన్ని ఏర్పాటు చేసి అత్యవసరం గా మరమ్మత్తులు అందించేలా చూడాలని ఆదేశించారు. కొన్ని స్వచ్ఛ ఆటో లకు మైక్ సెట్ లు లేవని వెంటనే ఏర్పాటు చేసి తడి పొడి చెత్తను వేరుగా అందించేలా అవగాహన కలిగించాలని అన్నారు. మరమత్తులకు గురి అయిన స్వచ్ఛ ఆటో లకు వెంటనే మరమ్మత్తులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు రావాలని మేయర్ తెలిపారు. పారిశుద్ధ్య పనులకు ఆటంకం కలుగకుండా తాత్కాలికం గా అట్టి ఆటోల స్థానం లో ట్రాక్టర్ లను ఏర్పాటు చేసి చెత్త తరలింపు చేపట్టాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఈ సత్యనారాయణ, సిఎంహెచ్ఓ డా.రాజారెడ్డి, ఎం హెచ్ ఓ డా.రాజేష్, ఈ ఈ లు మహేందర్, రవికుమార్, మాధవి లత, డి ఈ లు రాజ్ కుమార్, రాగి శ్రీకాంత్ సానిటరీ సూపర్ వైజర్ గోల్కొండ శ్రీను, ఏ ఈ లు ఫణి, సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జిగా బంగరిగళ్ళ మహేందర్ నియామకం

**నియామక పత్రం అందజేసిన జిల్లా కమిటీ సభ్యులు**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** బహుజన్ సమాజ్ పార్టీ అభివృద్ధికి క్షేత్రస్థాయిలో తన వంతు కృషి చేస్తానని, బిఎస్పి నియోజకవర్గ ఇన్చార్జ్ మహేందర్ అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో, బుధవారం రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ నూతన కమిటీ నియామక సమావేశం వినోద కన్వెన్షనల్ లో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన, రంగారెడ్డి జిల్లా జోనల్ ఇంచార్జ్ గ్యార జగన్, జిల్లా ఇన్చార్జ్ పల్లాటి రాములు, జిల్లా ఇంచార్జ్ గౌరవనీయులైన బండారి రవికుమార్ ముదిరాజు, జిల్లా అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి గ్యార మల్లేష్ హాజరై, పార్టీ దిశ నిర్దేశం చేసి నాపై నమ్మకం ఉంచి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇన్చార్జిగా నియమించి నియామక పత్రం అందించిన, రంగారెడ్డి జిల్లా కమిటీ కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆదేశాల సూచన మేరకు తుచా తప్పకుండా పార్టీ సభ్యులను కార్యకర్తలను కలుపుకొని ముందుకు వెళ్తానని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇంచార్జ్ బంగరిగళ్ళ మహేందర్ తెలిపారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల, నాలుగు మున్సిపాలిటీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నామినేషన్ స్వీకరణల పొరపాట్లు జరగవద్దు

- నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ జీవన్
- అభ్యర్థి నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి
- నామినేషన్ల ప్రక్రియ ఈ రెండు రోజులే కీలకం
- జిల్లా ఎన్నికల అధికారి సి నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరపాట్లకు తవ్వివకుండా అభ్యర్థి సమర్పించిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని జనరల్ అబ్జర్వర్ పి.ప్రశాంత్ జీవన్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. గురువారం మొదటి దశ పోలింగ్ కు సంబంధించి గురువారం నుండి ప్రారంభమైన ఈ నేపథ్యంలో, శంషాబాద్ మండలం పెద్దతుప్ర గ్రామ పంచాయతీ, పెద్దతుప్ర తండా, ముచ్చింతల్, మదనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మదనపల్లి, మదనపల్లి కొత్తతాండ, మదనపల్లి పాతతాండ గ్రామాల పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జనరల్ అబ్జర్వర్ పి.ప్రశాంత్ జీవన్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని, నామినేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను కూడా రిజిస్టర్ లో నమోదు చేయాలని జనరల్ అబ్జర్వర్ సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని అన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. జనరల్ అబ్జర్వర్ వెంట శంషాబాద్ ఎంపిడిఓ మున్ని, తహశీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.



## మీడియా సెంటర్ ను ప్రారంభించిన కలెక్టర్

**వరంగల్ మహా :** గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని వరంగల్ జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో ని డిపిఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎం.సీ.ఎం.సీ) ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద గురువారం ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసిఎంసి విధుల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎంసిఎంసి సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, సకాలంలో ప్రచార ప్రకటనలకు సంబంధించిన అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను గమనిస్తూ ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి మీడియా సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిపిఓ కల్పన, డిపిఆర్ఓ ఆయుబ్ అలీ, పిడి హౌసింగ్ గణపతి, ఆదనవు పీఆర్ ఓ ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ వేసే కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, బీసీ కమిషనర్

**ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు కృషి చేయాలి**



**వరంగల్ మహా;** గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా అంకితభావంతో పని చేయాలని ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయ దేవి అధికారులకు సూచించారు. గురువారం సాధారణ పరిశీలకులు, బాల మాయ దేవి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వ్యయ పరిశీలకులు సునాయన చౌహాన్ లతో కలసి నామినేషన్ల కు సంబంధించిన కేంద్రాలను పరిశీలించారు. వర్ధన్నపేట మండలం కట్ర్యాల, కడారి గూడెం, ఇల్లంద ,రామోజీ కుమ్మరిగూడెం తండ ,రాయపర్తి మండలం రాయపర్తి,జేతురాం తండ,రామన్న గూడెం,గణేష్ తండ, మహబూబ్ నగర్, పర్వతగిరి మండలం లోని అన్నారం షరీఫ్,పెద్ద తండ, దూప తండ, రావూర్, మోత్యతండ గ్రామపంచాతీలకు సంబంధించిన నామినేషన్ల కేంద్రాలను పరిశీలించారు . రిటర్నింగ్ అధికారుల ట్రైనింగ్, నిర్వహణ విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. క్లస్టర్ల వారిగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంప్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ....గ్రామ ప్రంచాయతీల ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో కావలసిన ధృవ పత్రాలను సమర్పించడం లాంటి విషయాలను అభ్యర్థులకు తెలియజేయాలని ఆమె సూచించారు. నామినేషన్ల ఫారాలను స్పష్టంగా చూసి వాటిల్లో ఏవైనా తప్పులు వుంటే సరిచేసుకునే విధంగా సహకరించాలని తెలిపారు. వ్యయ పరిశీలకులు సునాయన చౌహాన్ మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో అభ్యర్థులు ఖర్చుల వివరాలు ఎప్పటి కప్పుడు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు వ్యయం వివరాలు సమర్పించని ఎడల గెలుపు రద్దు అవుతుందనే విషయాన్ని కూడా అభ్యర్థులకు స్పష్టంగా తెలియ చేయాలని తెలిపారు. గ్రామపంచాయతీలో పోటీ చేసే అభ్యర్థలకు వ్యయాలకు సంబంధించి ప్రత్యేక బ్యాంకు ఖాత ఉండాలని సూచించారు. సర్పంచ్, వార్డు మెంబర్లు నిబంధనలకు అనుగుణంగానే ఖర్చు పెట్టాలనే విషయము అభ్యర్థులకు స్పష్టంగా తెలియ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జడ్పీ సీఈవో ఇంచార్జ్ డిఆర్డిఓ రాంరెడ్డి, డిపిఓ కల్పన, ఆర్డీవో సుమ , జిఎం ఇండస్ట్రియల్ అధికారి నరసింహ మూర్తి తో పాటు సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీవోలు, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

# బీసీలకు తీరని ద్రోహం



**మొయినాబాద్ మహా:** స్థానిక సంస్థల ఎన్నికల్లో పాత విధానంలోనే 50 శాతం రిజర్వేషన్లు మించకుండా నిర్వహించాలని నిర్ణయించి రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు తీరని ద్రోహం చేసిందని మొయినాబాద్ మండల ఎంపీటీసీ సంఘం మాజీ అద్యక్షుడు మోర శ్రీనివాస్ విమర్శించారు. మండల పరిధి లోని రెడ్డిపల్లి గ్రామంలో గురువారం ఆయన మాట్లాడుతూ బీసీలకు స్థానిక సం స్థలలో, విద్యా ఉద్యోగ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి బీసీల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన వాగ్దానాన్ని విస్మరించి బీసీలకు 23 శాతం రిజర్వేషన్లతో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధపడడం అత్యంత దుర్మార్గంగా ఉందన్నారు. నమ్మించి మోసం చేయడం పాలకులకు అలవాటుగా మారిందన్నారు. రాష్ట్రంలోని 12.783 గ్రామపంచాయతీలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లతో 2.929 సర్పంచ్ స్థానాలు కేటాయించడం, 112.474 వార్డులలో 42 శాతం రిజర్వేషన్లతో 47.239 వార్డులు రావాల్సి ఉండగా 23 శాతం తో కేవలం 25.869 వార్డులు మాత్రమే కేటాయించడంతో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఆరోపించారు. శాసన అమోదించిన బీసీ బిల్లులను కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడి రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్పించే ప్రయత్నం కావాలనే రేవంత్రెడ్డి చేయలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు మోసం చేయడంలో పోటీపడుతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

## నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి




**మొయినాబాద్ మహా:** కేంద్రప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసేందుకు కుట్రపూరితంగా భారత పారిశ్రామిక రంగాన్ని దేశ, విదేశీ పెట్టుబడుదారులకు అప్పనంగా కట్టబెట్టేందుకు నాలుగు లేబర్ కోడ్లను రూపొందించిందని మొయినాబాద్ సీఐటీయూ కన్వీనర్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. గురువారం ఆయన మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్నగర్లో మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం 29 కార్మిక చట్టాలను తొలగించి 4 చట్టా స్వభావం లేని కోడ్లుగా మార్చాడాన్ని ఆయన వ్యతిరేకించారు. కొత్త చట్టాలను రద్దు చేసి పాత 29 చట్టాలనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. గతంలో కేంద్రం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని కార్మిక సంఘాలన్ని ధర్నాలు ఆం దోళన, సమ్మెలు చేసినా నరేంద్రమోడీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. విలాసాలకు బాగా అలవాటుపడ్డ కేంద్ర పాలకులు కార్పొరేట్ కంపనీలు, పెట్టుబడిదారులా ద్వారా లబ్దిపొందుతూ వారి కోసమే బానిసల్లా పనిచేస్తున్నారని మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లో నాలుగు కోడ్లను అనుమతిం చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నిరంకుశ కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక, యజమాని అనుకూల నాలుగు కార్మిక కోడ్ల అమలు శ్రామిక ప్రజలపై దాడి చేయడమేనని ప్రవీనక్కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.




## Te-Poll యాప్ ను ప్రతి ఓటరు డౌన్‌లోడ్ చేసుకోవాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ మహా :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లకు సౌకర్యవంతంగా ఎన్నికల సమాచారాన్ని అందించేందుకు రూపొందించిన TePoll మొబైల్ యాప్ గూగుల్ ప్లే స్టోర్లో అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నేడోక ప్రకటనలో తెలిపారు. ఈ TePollయాప్‌ద్వారా ఓటర్లు పోలింగ్ కేంద్ర వివరాలు, ఓటర్ స్లిప్పు నమోదు సమాచారం సులభంగా తెలుసుకో గలుగుతారని పేర్కొన్నారు. ప్రతి ఓటరు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వినియోగించుకోవాలనికోరారు. జిల్లాలో ఓటరు అవగాహన మరియు ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలలో తమ ఓటు హక్కు వినియాగించుకోవాలని అన్నారు. ఈ యాప్‌ను విస్తృతంగా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. గూగుల్ ప్లే స్టోర్ లింక్: https://play.google.com/store/apps/details?id=com.cgg.gov.in.te_poll_telugu ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఉపయోగించుకుని ఓటింగ్‌లో ప్రక్రియలో పాల్గొనాలని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

## జిల్లా కలెక్టరేట్ లో మీడియా సెంటర్ ప్రారంభం



**జనగామ, మహా;** ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం జనగామ జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్ ను మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎం.సీ.ఎం.సీ)ను, సహాయక కేంద్రాన్ని జిల్లా జనరల్ అబ్సర్వర్ నిఖిల ప్రారంభించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మీడియా సెంటర్ ను, సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల పత్రికా ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం పై మీడియా సెంటర్ ద్వారా నిఘా పెట్టడం జరుగుతుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అబ్జర్వర్ కి తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందిస్తుంటారని. ఎంసిఎంసి సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, సకాలంలో ప్రచార ప్రకటనలకు సంబంధించిన అనుమతులు మంజూరు చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ పల్లవి తదితరులు పాల్గొన్నారు..

# నామినేషన్ల కేంద్రాల తనిఖీ



**నిర్మల్ మహా :** గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం అధికారులను ఆదేశించారు. గురువారం లక్ష్మణచందా మండలంలోని వడ్యాల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పంచాయితీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశీలకులు, కలెక్టర్ ఇక్కడ ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. పరిశీలకు మాట్లాడుతూ, హెల్ప్ డెస్క్ లో సిబ్బంది అందుబాటులో ఉంటూ, అభ్యర్థులకు సమాచారం ఇవ్వడంలో సహాయపడాలన్నారు. అధికారులు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేయాలని వివరించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి అన్ని రకముల ఫారములను తగినన్ని అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. రోజువారీగా నామినేషన్లకు సంబంధించి వివరాలన్నింటినీ తమకు అందజేయాలని వివరించారు. ప్రతిరోజు దాఖలు అయిన నామినేషన్ల పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యేవరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డిపిఓ శ్రీనివాస్, తహసిల్దార్ సరిత, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎన్నికల అధికారులు, సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీ ఎన్నికలకు అంతా సిద్ధం -కలెక్టర్



**ఆదిలాబాద్ మహా :** గ్రామ పంచాయతీ ఎన్నికలను శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా వెల్లడించారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. పోలింగ్ బూతులు, సిబ్బంది నియామకం, భద్రతా చర్యలు, బ్యాలెట్ పత్రాలు, ఇతర పోలింగ్ సామగ్రి పంపిణీ వరకు ప్రతి అంశం మండలవారీగా సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలపై అధికారులు, సిబ్బందికి ఇప్పటికే స్పష్టమైన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి పరిష్కరించేందుకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీసు శాఖతో సమన్వయం పెంచి సమగ్ర భద్రతా చర్యలు చేపట్టామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని, ఎలాంటి ఉల్లంఘనలు గమనించినా వెంటనే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రచారాలకు తప్పనిసరిగా ఎంసిఎంసి అనుమతి తీసుకోవాలని ఆయన సూచించారు. ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, ఇచ్చోడ మండలాల్లోని 166 గ్రామ పంచాయతీలకు సంబంధించిన మొదటి విడత ఎన్నికల కోసం 1408 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 20 శాతం రిజర్వులతో కలిపి మొత్తం 1478 మంది పీఓలు, 1729 మంది ఎపీఓలను నియమించినట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 4,49,981 మంది గ్రామీణ ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 2,19,652, మహిళలు 2,30,313, ఇతరులు 16 మంది ఉన్నారని వివరించారు. ఎన్నికల సమయంలో ఎఫ్ఎస్టీలూ, ఎస్ఎస్టీలూ నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాయని చెప్పారు. ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని, శాంతి భద్రతల విషయంలో ఎలాంటి రాజీ లేదని కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

**ఆమనగల్లు, మహా:** గ్రామపంచాయతీ ఎన్నికలకోడ్ అమలులో ఉందని, అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఆమనగల్లు ఎక్సైజ్ శాఖ సీఐ బద్యనాథ్ చౌహాన్ హెచ్చరించారు. గురువారం ఆమనగల్లు ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఎన్నికల కోడ్‌ను పాటించాలని, మద్యం అమ్మకాల పై నిఘా ఉంచామని, రహదారుల వెంట హోటళ్లు, డాబాల్లో మద్యం , బెల్టు షాపులతో మద్యం అమ్మితే కేసులు పెడతామన్నారు.




# వడ్డేపల్లి బండ్ అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

**బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వరంగల్ మహా;** వడ్డేపల్లి బండ్ పై కొనసాగుతున్న పనులలో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగర పరిధి లోని ప్రశాంత్ నగర్ లో గల ఎస్ టి పి,వడ్డేపల్లి బండ్, కరీమాబాద్ శాంతి నగర్ స్మశానవాటిక తో పాటు శ్యాయం పేట ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ సందర్భం గా కమిషనర్ హన్మకొండ మప్రశాంత్ నగర్ లో 15 ఎమ్ ఎల్ డి, ఎస్ టి పి ని క్షేత్ర స్థాయిలో సందర్శించి నిర్వహణ ను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. వడ్డేపల్లి బండ్ పై కొనసాగుతున్న పనుల పురోగతిని పరిశీలించి పనులు చాలా నెమ్మదిగా కొనసాగుతున్నాయని కాంట్రాక్టర్ కు నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. బండ్ పై కొనసాగుతున్న సైకిల్ ట్రాక్ పనులు, మీడియన్ లో బ్యాక్ ఫిల్లింగ్, లాండ్ స్కేప్ డిజైన్, రిటైనింగ్ వాల్ , హార్టికల్చర్ విభాగం వారు కొన్ని ప్రతిపాదనలు అందించిన నేపథ్యం లో ఆయా డిజైన్ ల గురించి అడిగి తెలుసుకొని ఆమోదించిన కమిషనర్ బండ్ పై అభివృద్ధి పనులు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ డిసెంబర్ లోగా స్మార్ట్ సిటీ గడువు ముగుస్తున్నందున అప్పటిలోగా ఈ పనులన్నీ పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం వరంగల్ పరిధి కరీమాబాద్ శాంతినగర్ ప్రాంతంలో గల గ్రేవ్ యార్డ్ లో నిర్మించిన సి సి రోడ్డు టాయిలెట్స్ , బర్నింగ్ ప్లాట్ ఫాం ను కమిషనర్ పరిశీలించారు. అంతకు ముందు శాయంపేట టెంపుల్ ట్రీ విల్లాస్ ప్రాంతం లో అవెన్యూ ప్లాంటేషన్ పరిశీలించి మీడియన్ లో స్క్వేర్ మీటర్ కు ఎన్ని మొక్కలు నాటారో కొలతలు వేసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ సత్యనారాయణ సి హెచ్ ఓ రమేష్ ఈఈ సంతోష్ బాబు డి ఈ లు రవి కిరణ్ రంగారావు సారంగం ఏ ఈ సౌజన్య స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు





# నిఫ్టీకి నూతన ఊపు..

## 14 నెలలకు ఆల్-టైమ్ హై

భారత స్టాక్‌మార్కెట్‌లో గురువారం (నవంబర్ 27) కీలక పరిణామం చోటుచేసుకుంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (NSE) ప్రధాన బెంచ్‌మార్క్ ఇండెక్స్ అయిన నిఫ్టీ 50 నూతన చరిత్ర సృష్టించింది. 14 నెలల తర్వాత కొత్త ఆల్-టైమ్ గరిష్ట స్థాయిని తాకింది. సెషన్ ప్రారంభంలోనే నిఫ్టీ 50 సూచీ 26,295 పాయింట్ల పైకి ఎగబాకి, 2024 సెప్టెంబర్ 27న నమోదైన పూర్వపు రికార్డు 26,277.35 పాయింట్లను అధిగమించింది. నిఫ్టీకి ఈ కొత్త మైలురాయిని చేరుకోవడానికి మొత్తం 287 ట్రేడింగ్ సెషన్లు పట్టింది.

**రికార్డు హైకి దోహదం చేసిన అంశాలు**

స్టాక్ మార్కెట్‌లో కొనుగోలు ధోరణి పెరగడానికి అనేక కారకాలు దోహదం చేశాయి. దేశీయ, అంతర్జాతీయ వడ్డీ రేట్లు కోతపై మార్కెట్ అంచనాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను గణనీయంగా పెంచాయి. కంపెనీల బలమైన క్యూ2 ఫలితాలు, అనేక రంగాల్లో ఆదాయ వృద్ధి ఊపందుకోవడం వల్ల సూచీకి శక్తి లభించింది. మ్యూచువల్ ఫండ్స్, దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి భారీ ఇన్‌ఫ్లోలు కొనసాగాయి. మార్కెట్ వాల్యుయేషన్‌లు కొంత సడలించడంవల్ల కొనుగోలు ఆకర్షణ పెరిగింది. గ్లోబల్ మార్కెట్లలో సానుకూల సెంటిమెంట్, అంతర్జాతీయ ట్రేడ్ & మాక్రో డేటా మెరుగుదల కూడా ప్రభావం చూపాయి.

**నిఫ్టీ పరిణామ క్రమం**

నిఫ్టీ సూచీ తన ప్రారంభం (1995-96) నుంచి ఇప్పటి వరకు నిర్మాణాత్మకంగా పెరుగుతూ భారీ వృద్ధిని నమోదు చేస్తూ వస్తోంది. 2007లో తొలిసారి 5,000 మార్క్‌ను దాటిన నిఫ్టీ 2017లో 10,000 మార్క్‌ను 2021లో 20,000 మైలురాయిని తాకింది. 2024లో 25,000 మార్క్‌ను అందుకున్న ఈ ఎన్ఎస్ఈ ఇండెక్స్ 2025లో 26,000 మైలురాయిని దాటింది. నిఫ్టీ సూచీకి 2024 సంవత్సరం అనేక రికార్డులు అందించింది. ఆ ఒక్క ఏడాదిలోనే నిఫ్టీ 59 కొత్త రికార్డు హైలు నమోదు చేసింది.

**ఏ స్టాక్స్ మెరిశాయంటే..**

తాజా ర్యాలీలో ముఖ్యంగా బ్యాంకింగ్ & ఫైనాన్స్ రంగంలో యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ మెరిశాయి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ & ఇంజనీరింగ్ సెక్టార్‌లో లార్సెన్ & టూబ్రో, కన్స్యూమర్ & మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో ఏషియన్ పెయింట్స్ వంటి స్టాక్స్ ఉత్తమ పనితీరు కనబర్చాయి. ఇతర బ్లూ-చిప్ కంపెనీలు కూడా సానుకూల త్రైమాసిక ఫలితాలు వెలువరించడంతో సూచీకి కొత్త ప్రాణం పోశాయి.

**నిపుణుల విశ్లేషణ**

మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. నిఫ్టీ ప్రస్తుత ర్యాలీ పూర్తిగా ఫండమెంటల్స్ ఆధారిత స్థిరమైన వృద్ధిగా కనిపిస్తోంది. వడ్డీ రేట్లు తగ్గే అవకాశం, ఎఫ్ఐఐ రాకల్లో మెరుగుదల, దేశీయ డిమాండ్ పెరుగుదల.. ఇవన్నీ మార్కెట్‌కు మద్దతునిస్తున్నాయి. ఇకపోతే, అంతర్జాతీయ స్థూల అనిశ్చితులు, డాలర్ బలం, క్రూడ్ ధరల్లో మార్పులు వంటి అంశాలు వచ్చే రోజుల్లో మార్కెట్‌లో అస్థిరతకు దారితీయవచ్చు అని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. బ్రోకరేజ్ సంస్థల అంచనాల ప్రకారం.. పాలసీ సడలింపులు, ఆర్థిక వృద్ధి స్థిరంగా కొనసాగితే నిఫ్టీ 2026 నాటికి 30,000 మార్క్‌ను తాకే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# 350 ఏళ్ల చరిత్ర కలిగిన ప్యాలెస్ పునరుద్ధరణ



మధ్యప్రదేశ్‌లోని చారిత్రక నగరమైన ఖజురహోలో ప్రతిష్ఠాత్మకమైన 'ది ఒబెరాయ్ రాజ్‌గఢ్ ప్యాలెస్'ను ప్రారంభిస్తున్నట్లు ఒబెరాయ్ గ్రూప్ ప్రకటించింది. ఇది 76 ఎకరాల విస్తీర్ణంలో సుమారు 350 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్యాలెస్. ఈ చారిత్రక వారసత్వ కట్టడాన్ని ఇటీవల ఒబెరాయ్ గ్రూప్ పునరుద్ధరించింది. సహజ సరస్సు, మనియాఘర్ కొండలవాలుపై సాల్, పలాష్ అడవుల మధ్య వింధ్యాచల్ పర్వాత శ్రేణుల్లో ఈ ప్యాలెస్ ఉంది. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద అయిన ఖజురహో దేవాలయాలు, పన్నా నేషనల్ పార్క్‌కు సమీపంలో ఈ హోటల్ ఉండటం వల్ల చాలా మంది ఇందులో బస చేసేందుకు అవకాశం ఉందని ఒబెరాయ్ గ్రూప్ తెలిపింది. ది ఒబెరాయ్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అర్జున్ ఒబెరాయ్ ఈ పునరుద్ధరణపై స్పందిస్తూ చరిత్రకు తిరిగి జీవం పోసే ప్రయాణంగా దీన్ని అభివర్ణించారు. ఖజురహోలో బుందేలా స్మారక చిహ్నం సమగ్రతను కాపాడుతూనే, ఆధునిక సౌకర్యాలను జోడించినట్లు తెలిపారు. ఈ ఎస్టేట్‌లో మొత్తం 65 గదులు, సూట్ రూమ్‌లున్నట్లు కంపెనీ తెలిపింది. వీటిలో ప్యాలెస్ సూట్లు, ప్రైవేట్ పూల్ విల్లాలు, తోటలు/ టెర్రస్‌లతో కూడిన రూమ్స్ ఉన్నాయి. వీటిలో కోహినూర్ సూట్ అత్యంత ప్రత్యేకమైనదని కంపెనీ చెప్పింది. ప్యాలెస్ గదుల నుంచి చుట్టూ ప్రదేశాల 360 డిగ్రీల వ్యూను ఆస్వాదించవచ్చని పేర్కొంది.



# రికార్డు స్థాయిలో చమురు దిగుమతులు

అమెరికా ఆంక్షలు అమల్లోకి రాకముందే నవంబర్ నెలలో భారతీయ రిఫైనరీలు రష్యా నుంచి ముడి చమురు సరఫరాలను భారీగా పెంచాయి. దీని ఫలితంగా నవంబర్ 2025లో రష్యా నుంచి భారత దేశం ముడి చమురు దిగుమతులు రోజుకు సగటున 1.9 మిలియన్ బ్యారెల్స్‌తో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గ్లోబల్ రియల్ టైమ్ డేటా అనలిటిక్స్ ప్రొవైడర్ కెప్లర్ వెల్లడించిన వివరాల ప్రకారం నవంబర్ 2025లో రష్యా అతిపెద్ద ముడి చమురు కొనుగోలుదారుగా భారత్ నిలిచింది. ఈ నెలలో ఇప్పటివరకు కార్గోలు సగటున రోజుకు 1.886 మిలియన్ బ్యారెల్స్ చమురు దిగుమతి చేసుకున్నాయి.


**గణనీయ పెరుగుదల**

నవంబర్ 2025లో చమురు దిగుమతులు అంతకుముందు నెలతో పోలిస్తే 17 శాతం పెరిగాయి. 2024లో ఇదే నెలతో పోలిస్తే దాదాపు 6 శాతం అధికమయ్యాయి. అలాగే 2023లో ఇదే నెలతో పోలిస్తే 12 శాతం పెరిగాయని కెప్లర్ డేటా వెల్లడించింది. నవంబర్ 21లోపు కొనుగోళ్లు పెరగడంతో భారత దేశానికి రష్యన్ క్రూడ్ దిగుమతి 5 నెలల గరిష్టానికి చేరుకుంటుందని భావిస్తున్నారు. ఎందుకంటే, నవంబర్ 21 నుంచే రోస్‌నెఫ్ట్, లుకోయిల్పై అమెరికా ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో అంతకుముందే భారీగా క్రూడ్‌ను దిగుమతి చేసుకున్నట్లు తెలుస్తుంది.

**తగ్గుముఖం పట్టే అవకాశం**

నవంబర్ 21 తర్వాత రష్యా నుంచి భారతదేశం చమురు దిగుమతులు తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, ఇది తాత్కాలికంగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇది సరఫరా గొలుసులను పునర్వ్యవస్థీకరించడానికి వీలు కల్పిస్తుందని భావిస్తున్నారు.

# మూడేళ్లలోనే ఎంత మార్పు?



దేశ లగ్జరీ హౌసింగ్ మార్కెట్ ఏటేటా పెరిగిపోతోంది. రియల్ ఎస్టేట్ రీసెర్చ్ సంస్థ అనరాక్ రీసెర్చ్ విడుదల చేసిన తాజా డేటా ప్రకారం.. గత మూడేళ్లలో ఇతర అన్ని రెసిడెన్సియల్ కేటగిరీలను అధిగమించింది. రూ.1.5 కోట్లకు పైబడి ధర కలిగిన గృహాలు దేశంలోని టాప్ ఏడు నగరాల్లో సగటున 40% ధరల పెరుగుదలను నమోదు చేశాయి. దేశ రాజధాని ప్రాంతం (NCR) 72% ఎదుగుదలతో అత్యధిక ధరల పెరుగుదల నమోదు చేసింది. ఈ విభాగంలో ఇక్కడ 2022లో చదరపు అడుగు సగటు ధర రూ. 13,450 ఉండగా 2025 నాటికి రూ. 23,100 లకు పెరిగింది. ఈ బడ్జెట్ విభాగంలో ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్) 43 శాతంతో రెండవ స్థానంలో ఉండగా, బెంగళూరు 42 శాతం పెరుగుదలతో రెండో స్థానంలో నిలిచింది. మన భాగ్య నగరం హైదరాబాద్ ఈ ర్యాలీలో ప్రత్యేక స్థానాన్ని పొందింది. 2022-2025 మధ్య లగ్జరీ సెగ్మెంట్‌లో 41% పెరుగుదలను నమోదు చేసి, ధరల పెరుగుదల పరంగా టాప్ పెర్ఫార్మర్లలో ఒకటిగా నిలిచింది.

**హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు ఇలా..**

ప్రస్తుతం హైదరాబాద్‌లో వివిధ కేటగిరీలలో ఇళ్ల సగటు ధరలు ఇలా ఉన్నాయి. లగ్జరీ హౌసింగ్ విభాగంలో చదరపు అడుగుకు రూ.14,200 గా ఉంది. మిడ్‌రేంజ్ / ప్రీమియం కేటగిరిలో చదరపు అడుగుకు సగటున రూ.8,420 ధర నడుస్తోంది. ఇక అఫోర్డబుల్ విభాగంలో చదరపు అడుగు ధర రూ.5,235 వద్ద ఉంది. ధరల పెరుగుదల పరంగా భాగ్య నగరం బలమైన పనితీరు చూపుతున్నప్పటికీ, ఇప్పటికీ హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే కొనుగోలుదారులకు మరింత ఆకర్షణీయంగా, అందుబాటు ధరలు కలిగినదిగానే ఉంది.

## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

# దేశభక్తి నినాదాలపై నిషేధమా?

## బెంగాల్ సీఎం అధినేత మమతా బెనర్జీ ఆందోళన



**కోల్‌కతా:** పార్లమెంట్ లోపల ఎంపీలు జైహింద్, వందేమాతరం అనే నినాదాలు చేయొద్దని ప్రభుత్వం ఆంక్షలు విధిస్తున్నట్లు వచ్చిన వార్తలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తంచేశారు. ఇందులో నిజం ఎంతవరకు ఉందో తనకు తెలియదని, ఎంపీలతో మాట్లాడి అసలేం జరిగిందో తెలుసుకుంటానని చెప్పారు. బుధవారం కోల్‌కతాలో రాజ్యాంగ దినోత్సవంలో మమతా బెనర్జీ పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ప్రజల్లో దేశభక్తిని ప్రేరేపించిన నినాదాలను నిషేధిస్తే మన గుర్తింపును మనమే నాశనం చేసుకున్నట్లు అవుతుందని వెల్లడించారు. వందేమాతరం మన జాతీయ గీతమని గుర్తుచేశారు. స్వాతంత్ర్య పోరాటంలో వందేమాతరం నినాదం అందరినోట మార్మోగిందని, ఈ విషయం మర్చిపోవద్దని కోరారు. పార్లమెంట్ లోపల జైహింద్, వందేమాతరం నినాదాలను అడ్డుకోవాలన్న ఆలోచన సరైంది కాదని సూచించారు. బెంగాల్‌కు చెందిన సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్ రాయ్‌ని బీజేపీ నాయకులు కించపరుస్తున్నారని మమతా బెనర్జీ మండిపడ్డారు. బెంగాల్ గడ్డను అవమానిస్తున్నారని ధ్వజమెత్తారు. బెంగాల్ కూడా భారతదేశంలో భాగమేనని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతూనే ఉంటామని స్పష్టంచేశారు.

## షేర్ మార్కెట్ దందాలో

# రూ.35 కోట్లు ముంచేశారు!



**ముంబై:** షేర్ మార్కెట్‌లో ట్రేడింగ్ పేరుతో ముంబైకి చెందిన ఒక వ్యాపారవేత్త భారీగా మోసపోయిన వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. దాదాపు రూ.35 కోట్లు మోసపోయిన దిగ్భ్రాంతికర వార్త కలకలం రేపుతోంది. తన భార్య పేరుతో ఉన్న డీమ్యాట్ ఖాతాను ఒక బ్రోకరేజ్ సంస్థ అన్యాయంగా వాడి మోసం చేసిందని 72 ఏళ్ల వ్యాపారవేత్త వాపోతున్నారు. గత నాలుగేళ్లుగా ఈ మోసానికి తెగబడిందని మతుంగా వెస్ట్ నివాసి భరత్ హరక్‌చంద్ షా అనే బ్రోకరేజ్ సంస్థ గ్లోబ్ క్యాపిటల్ మార్కెట్ లిమిటెడ్‌పై ఆరోపణలు గుప్పించారు.

**అసలేమైంది అంటే.**

పరేల్‌లో క్యాన్సర్ రోగుల కోసం తక్కువ అద్దెకు గెస్ట్ హౌస్ నడుపుతున్న షా, తన భార్యతో పాటు, 1984లో తన తండ్రి మరణించిన తర్వాత ఆయన షేర్ పోర్ట్‌ఫోలియోను వారసత్వంగా పొందారు. కానీ ఆ జంటకు స్టాక్ మార్కెట్‌పై ఎలాంటి పరి జ్ఞానం లేదు. ఎపుడూ ట్రేడింగ్ చేసిన అనుభవమూ లేదు. దీంతో స్నేహితుడి సలహా మేరకు షా తనకు , తన భార్యకు గ్లోబ్ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్‌లో డీమ్యాట్ , ట్రేడింగ్ ఖాతాను తెరిచి, వారి వారసత్వంగా వచ్చిన షేర్లను కంపెనీకి బదిలీ చేశాడు. అక్షయ్ బరియా ,కరణ్ సిరోయా అనే ఇద్దరు ఉద్యోగులకు వీరి పోర్ట్‌ఫోలియోను "నిర్వహించే" బాధ్యతను అప్పగించారు. ఇక అక్కడినుంచి వీరి మోసానికి తెరలేచింది. వారి ఖాతాలకు పూర్తిగా నియంత్రణలోకి తీసుకొన్నారు. మొదట్లో కొద్దో గొప్పో సమాచారం ఇచ్చినప్పటికీ, ఆ తరువాత అసలు వీళ్లని సంప్రదించేవారు కాదు. అయితే మార్చి 2020 జూన్ 2024 మధ్య, లాభాలు, క్లీన్ స్టేట్‌మెంట్ రావడంతో ఎలాంటి అనుమానం రాలేదు. తన ఖాతాల ద్వారా విస్తృతమైన వాణిజ్య కార్యకలాపాలు జరుగుతున్నాయని షాకు తెలియదు.

**మోసం ఎలా బైట పడింది?**

జూలై 2024లో షాకు గ్లోబ్ క్యాపిటల్ రిస్క్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ నుండి అకస్మాత్తుగా కాల్ వచ్చింది. దాని సారాంశం ఏమిటయ్యా అంటే.. మీ భార్యాభర్తలఖాతాల్లో రూ. 35 కోట్ల డెబిట్ ఉంది. వెంటనే దాన్ని చెల్లించాలి, లేకపోతే మీ షేర్లన్నీ అమ్మేస్తాం'' అని చెప్పడంతో నిర్ఘాంత పోవడం షా వంతైంది. కంపెనీని సందర్శించినప్పుడు, భారీ, అనధికార వ్యాపారం జరిగిందని అతనికి సమాచారం అందింది.జరిగిన మోసాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


## టీటీడీలో గత పదేళ్ల నెయ్యి కొనుగోళ్ళపై

# విచారణ చేయాలి



**న్యూఢిల్లీ:** తిరుమల లడ్డూ ప్రసాదంపై తప్పుడు ప్రచారాలకు ఇకనైనా ముగింపు పలకాలని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సూచించారు. తిరుమల ప్రసాదంపై పదే పదే తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాస్తవాలు తెలుసుకని మాట్లాడితే మంచిదన్నారు. లడ్డూ ప్రసాదంపై జంతువుల కొవ్వు ఆరోపణలపై సిట్ ఇప్పటివరకూ క్లారిటీ ఇవ్వలేదన్నారు. ఈరోజు (గురువారం, నవంబర్ 27వ తేదీ) న్యూఢిల్లీ నుంచి మీడియాతో మాట్లాడిన వైవీ సుబ్బారెడ్డి.. తిరుమల లడ్డూ విషయంలో తాము ఎటువంటి తప్పు చేయలేదన్నారు. ప్రసాదం టెస్టింగ్ విసయంలో పటిష్టమైన వ్యవస్థ ఉన్నప్పుడు ఎలా కల్తీ జరుగుతుందన్నారు. తమ హయాంలో నాలుగు నెయ్యి ట్యాంకర్లను తిరస్కరించామని, టీటీడీలో 15 ఏళ్లుగా ఏం జరుగుతుందో తెలుసుకుని మాట్లాడాలన్నారు. తిరుమలలో ప్లాస్టిక్ వాడకాన్ని కూడా నిషేధించామన్నారు. ఈవో, చంద్రబాబులు తిరుమల లడ్డూ వివాదంపై పరస్పర విరుద్ధ ఆరోపణలు చేశారని, దానిపై ఇప్పటివరక ఊ సిట్ క్లారిటీ ఇవ్వలేదన్నారు. తిరుమల లడ్డూ అంశంపై చంద్రబాబు తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ఎవరి మీద బురద జల్లుతున్నారని ప్రశ్నించారు. 20192024 వరకూ తయారైనా లడ్డూలన్నీ కల్తీ చేసినట్లు తప్పుడు ప్రచారాలకు దిగారన్నారు. రాజకీయ లబ్ధికోసమే చంద్రబాబు తప్పుడు ప్రచారం చేసి.. కోట్లాడి మంది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో భక్తుల కానుకలను ప్రైవేట్ బ్యాంకులో డిపాజిట్ చేసిన విషయాన్ని వైవీ సుబ్బారెడ్డి గుర్తుచేశారు. గత పది ఏళ్ల నెయ్యి కొనుగోళ్ళ పై విచారణ చేయాలి టీటీడీలో గత పది ఏళ్ల నెయ్యి కొనుగోళ్లపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు వైవీ సుబ్బారెడ్డి. '2014 నుంచి జరిగిన నెయ్యి కొనుగోళ్ళ పై విచారణ జరపాలి. 2024 ఆగస్టులో బాబు హయాంలోనే కల్తీ నెయ్యి ట్యాంకర్లు రిజెక్ట్ చేశారు..దానిపై సమాధానం చెప్పాలి. నేను ఎలాంటి తప్పు చేయలేదు. మేము, మా కుటుంబం ఎవరివద్ద డబ్బు తీసుకోలేదు. నేను లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం. సత్య శోధన పరీక్షకు సిద్ధంగా ఉన్నా. నేను ఏ అవినీతికి పాల్పడలేదు. అలాగే, ఎస్ బ్యాంక్‌లో టీటీడీ డబ్బు డిపాజిట్లు, శ్రీనివాస సేతు వ్యవహారంపై దర్యాప్తు చేయాలి. అప్పన్న నా పిఎ కాదు. ఆయనకు నాకు సంబంధం లేదు. అప్పన్న ఎంపీ వేమిరెడ్డి దగ్గర పని చేశారు' అని తెలిపారు.

## తెలుగు రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో ఈడీ సోదాలు




**ఢిల్లీ:** ప్రైవేట్ మెడికల్ కళాశాలలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రత్యేక దృష్టి సారించాయి. గురువారం దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు జరుగుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 10 రాష్ట్రాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నట్లు అధికారులు ధృవీకరించారు. సీబీఐ కేసు ఆధారంగానే ఈ తనిఖీలు జరుగుతున్నట్లు అధికార వర్గాలు ధృవీకరించాయి. ఎన్ఎంసీ ప్రమాణాలు పాటించకుండానే అప్రూవల్స్ నేపథ్యంతో ఈ రైడ్స్ జరుగుతున్నట్లు సమాచారం. కొన్ని రోజుల క్రితం మెడికల్ కౌన్సిల్ సభ్యులతో పాటు మెడికల్ కళాశాలల ప్రతినిధులను సీబీఐ ప్రశ్నించింది కూడా. ఈ క్రమంలో ఇవాళ ఇటు ఈడీ ప్రత్యక్ష దాడులకు దిగడం గమనార్హం. ఏపీ, తెలంగాణల్లోని పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో ఈడీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. పలు కీలక డాకుమెంట్లను పరిశీలిస్తున్న అధికారులు.. మెడికల్ సీట్ల కేటాయింపులు సహా పలు అంశాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

# ఆ జంతువుపై భారీ మూల్యం



**వాషింగ్టన్ డీసీ:** అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో ఇద్దరు వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డ్ సభ్యులపై జరిగిన కాల్పుల సంఘటనపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. కాల్పులు జరిపిన వ్యక్తిని ఉద్దేశిస్తూ తన ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్‌లో చేశారు. దానిలో ట్రంప్ ఆ నిందితుడిని జంతువుతో పోల్చారు. అతను భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. గాయపడిన గార్డులను చికిత్స కోసం రెండు వేర్వేరు ఆసుపత్రులకు తరలించనట్లు తెలిపారు. ఈ ఘటన దరిమిలా ట్రంప్ నగరానికి అదనంగా 500 మంది నేషనల్ గార్డ్ సభ్యులను మోహరించాలని ఆదేశించారు. ట్రంప్‌తో పాటు వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కూడా ఈ దాడిపై విచారం వ్యక్తం చేశారు. వాన్స్.. ఆ గార్డులను ధైర్యస్థులు అని కొనియాడగా , ఒబామా 'అమెరికాలో హింసకు స్థానం లేదు' అని వ్యాఖ్యానించారు. బాధిత సైనికులు, వారి కుటుంబాల కోసం తాను, మిచెల్ ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. తాజాగా ఈ దాడి వెనుక ఉన్న అనుమానితుడి వివరాలు వెల్లడయ్యాయి. చట్ట అమలు అధికారులు అందించిన సమాచారం ప్రకారం, కాల్పులు జరిపిన వ్యక్తిని 29 ఏళ్ల ఆఫ్ఘన్ జాతీయుడు రహ్మనుల్లా లకాన్వాల్‌గా గుర్తించారు. ఎన్‌వై పోస్ట్ నివేదిక ప్రకారం లకాన్వాల్ 2021లో ఆఫ్ఘనిస్తాన్ నుండి సైనిక ఉపసంహరణ సమయంలో అమెరికాకు వచ్చాడు. అనుమానితుడు కూడా కాల్పుల్లో గాయపడ్డాడు. అయితే అతనికి ప్రాణాపాయం లేదని చట్ట అమలు అధికారి తెలిపారు. ఈ కాల్పులు బుధవారం మధ్యాహ్నం 2:15 గంటలకు జరిగాయి. దాడి చేసిన వ్యక్తి ముందుగా ఒక మహిళా గార్డుపై కాల్పులు జరిపాడు. అనంతరం కాల్పులతో మరో గార్డును కూడా గాయపరిచాడు. అయితే సమీపంలో ఉన్న మూడవ గార్డు వెంటనే స్పందించి, కాల్పులు జరిపిన వ్యక్తిని అదుపు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఇద్దరు గార్డులు తీవ్రంగా గాయపడగా, వారి పరిస్థితిపై మొదట్లో గందరగోళం నెలకొంది. వెస్ట్ వర్జీనియా గవర్నర్ పాట్రిక్ మోరిస్సే ఆ ఇద్దరు గార్డులు మరణించారని ప్రకటించిన కొద్దిసేపటికే ఆ ప్రకటనను వెనక్కి తీసుకున్నారు. గాయపడిన ఈ ఇద్దరు యూఎస్ గార్డ్‌మెన్లు, నేరాలను అరికట్టే మిషన్‌లో భాగంగా మోహరించిన 2,000 మందికి పైగా సైనికులలో సభ్యులు. ఈ దాడి నేషనల్ గార్డ్ దళాల భద్రత, వారి విధి నిర్వహణలో సవాళ్లను మరోసారి ఎత్తిచూపింది.



## ఆ సినిమాలో బోల్డ్ సీన్స్.. మీరకున్నట్లు ఉండవు: ఆండ్రియా

సింగర్‌గా మాత్రమే కాదు.. నటిగా, హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న భామ ఆండ్రియా జెరెమా. విభిన్నమైన పాత్రలు చేస్తూ సినీ ప్రియులను అలరిస్తోంది. కోలీవుడ్ మాత్రమే కాదు.. టాలీవుడ్‌లోనూ ఆమె దాదాపు సుపరిచితమే. ఈ ఏడాది మాస్క్ మూవీతో ప్రేక్షకులను పలకరించింది. కవిన్ హీరోగా వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ బాక్సాఫీస్ వద్ద మిక్సడ్ టాక్‌ను సొంతం చేసుకుంది. అయితే ఆండ్రియా పిశాచి2 అనే చిత్రంలోనూ నటిస్తోంది. ఈ హారర్ థ్రిల్లర్ మూవీ ప్రకటించి మూడేళ్లయినా ఇప్పటివరకు విడుదల కాలేదు. ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని చాలా కాలం అయ్యింది. అయితే కొన్ని ఆర్థికపరమైన సమస్యల కారణంగా విడుదల కాలేదు. ఈ చిత్రానికి కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ మిస్కిన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సినిమాలో ఆండ్రియా న్యూడ్ సీన్‌లో కనిపించే పోస్టర్‌పై అప్పట్లో పెద్ద వివాదమే నడిచింది. దీనిపై పెద్దఎత్తున విమర్శలొచ్చాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన ఆండ్రియా.. ఆ వివాదస్పద సీన్ గురించి మాట్లాడింది. స్క్రిప్ట్ ప్రారంభంలోనే ఆ బోల్డ్ సీన్ చేర్చారని పంచుకుంది. అయితే షూటింగ్ సమయంలో ఆ సన్నివేశాన్ని పూర్తిగా తొలగించారని తెలిపింది. ఈ చిత్రంలో ఎవరూ కూడా నగ్నంగా కనిపించరని పేర్కొంది. తనకు డైరెక్టర్ మిస్కిన్‌పై పూర్తి నమ్మకముందని.. ఆయన కథకు అవసరమైతేనే అలాంటి సీన్స్ పెడతారని వివరించింది. ఈ చిత్రంలో బోల్డ్ సీన్స్ కూడా ఉన్నాయని.. కానీ అవన్నీ నగ్నంగా మాత్రం ఉండవని చెప్పింది. ఆయన ఇప్పటికే పలువురు స్టార్ నటులతో సినిమాలు చేశారని గుర్తు చేసింది. ఒకవేళ డైరెక్టర్ ఆ సీన్ అవసరమని భావిస్తే అతని దృష్టి కోణం అది కాదని.. ఆ సీన్ వెనకాల కచ్చితంగా అర్థముంటుందని ఆండ్రియా చెబుతోంది.



## కలిసిరాని ఓజీ.. అవకాశాలకు దారేది?

కొన్నిసార్లు అన్నీ అనుకున్నట్లు జరగవు.. హీరోయిన్ ప్రియాంక మోహన్ పరిస్థితి కూడా ఇదే! బెంగళూర్‌కు చెందిన ఈ మూడు పదుల భామ 2019లో మాతృభాష (కన్నడం)లో కథానాయికగా ఎంట్రీ ఇచ్చింది. ఆ తరువాత టాలీవుడ్‌పై బ్యూటీ దృష్టి పడింది. అలా నాని గ్యాంగ్‌లీడర్ చిత్రంలో హీరోయిన్‌గా నటించింది. ఆ చిత్రం విజయంతో శ్రీకారం అనే చిత్రంలో నటించే అవకాశాన్ని దక్కించుకుంది. కానీ, ఈ మూవీ నిరాశ పరిచింది.

### బ్రేక్


అయినా ప్రియాంక మోహన్‌ను లక్కు వదలలేదు. వెంటనే శివకార్తికేయన్‌కు జంటగా డాక్టర్ అనే చిత్రంతో కోలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. ఆ చిత్రం హిట్ అవ్వడంతో అదే హీరోతో డాన్ అనే మరో చిత్రం చేసింది. అది సూపర్‌హిట్ అయ్యింది. ఆ తరువాతనే బ్రేక్ పడింది. సూర్యకు జంటగా నటించిన ఎదర్కుం తునిందవన్ చిత్రం నిరాశ పరచింది. ఆ తరువాత సక్సెస్ కోసం ఎదురు చూస్తున్న ఈ అమ్మడికి తెలుగులో సరిపోదా శనివారం చిత్రం విజయం కాస్త ఊరటనిచ్చింది.

### ఉపయోగపడని ఓజీ

పవన్‌కల్యాణ్‌కు జంటగా ఓజీ చిత్రంలో నటించే అవకాశం రావడంతో స్టార్ హీరోయిన్ ఇమేజ్ వస్తుందని తెగ సంబరపడిపోయిందనే చెప్పాలి. అయితే ఆ చిత్రం హిట్ అనిపించుకున్నా, ప్రియాంక మోహన్ కెరీర్‌కు ఏమాత్రం ఉపయోగపడలేదు. అంతే కాదు తెలుగులో ఇప్పటి వరకూ మరో అవకాశం రాలేదు. తమిళంలో జయంరవికి జంటగా నటించిన బ్రదర్ చిత్రం బోల్తా పడింది. ఆ తరువాత నిలవుక్కు ఎన్ మేల్ ఎన్నడీ కోపం చిత్రంలో గోల్డెన్ స్పారో అనే ప్రత్యేక పాటలో యాక్ట్ చేసింది. ఆ చిత్రం ఈమె కెరీర్‌కు ఉపయోగపడలేదు.


### ఈ సినిమాలపైనే ఆశలు

కాగా ప్రస్తుతం కెవిన్‌కు జంటగా ఒక చిత్రం, మేడ్ ఇన్ కొరియా అనే మరో చిత్రంలోనూ నటిస్తోంది. వీటిలో ఏదైనా హిట్ అయితేనే ప్రియాంకమోహన్‌కు మరిన్ని అవకాశాలు వస్తాయనే టాక్ స్ప్రెడ్ అవుతోంది. కాగా సుమారు ఐదేళ్ల తరువాత మాతృభాషలో నటించే అవకాశం ఆ బ్యూటీని వరించింది. ఇలా తమిళం, తెలుగు, కన్నడం, భాషల్లో గత ఆరేళ్లుగా నటిస్తున్నా ఇంకా స్టార్ ఇమేజ్ కోసం కష్టపడుతోంది.



## పెళ్లి చేసుకున్న రాహుల్ సిప్లిగంజ్

టాలీవుడ్ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ పెళ్లి పీటలెక్కాడు. ప్రియురాలు హరణ్య మెడలో మూడుముళ్లు వేశాడు. హైదరాబాద్‌లో గురువారం ఉదయం ఈ వివాహ వేడుక జరిగింది. ఆగస్టులో నిశ్చితార్థం చేసుకున్న ఈ జంట ఇప్పుడు వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం వీరి పెళ్లి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. హైదరాబాద్‌లోని ధూల్‌పేటలో మధ్య తరగతి కుటుంబంలో రాహుల్ సిప్లిగంజ్ జన్మించాడు. అతడికి సంగీతంపై ఉన్న ఆసక్తి గమనించిన తండ్రి గజల్ మాస్టర్ వద్దకు తీసుకెళ్లాడు. ఓవైపు సంగీతంలో శిక్షణ తీసుకుంటూ మరోవైపు తండ్రికి సాయంగా బార్బర్ షాప్‌లో పని చేశాడు. కాలేజీ బుల్లోడ.. వాస్తు బాగుందే.. ఈగ టైటిల్ సాంగ్.. సింగరేణుంది బొగ్గే పండింది, రంగా రంగా రంగస్థలానా.. బోనాలు ఇలా అనేక సాంగ్స్ పాడాడు. మంగమ్మ, పూర్ బాయ్, గల్లీకా గణేశ్, దావత్ వంటి పలు ప్రైవేట్ ఆల్బమ్స్ రూపొందించాడు. తెలుగు బిగ్‌బాస్ సీజన్ 3లో పాల్గొని విజేతగా నిలిచాడు. ఆర్ఆర్ఆర్ మూవీలో కాలభైరవతో కలిసి పాడిన నాటునాటు పాట అతడికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది.





### సోషియో ఫాంటసీ కథతో వానర

అవినాశ్ తిరువీధుల హీరోగా, దర్శకుడిగా పరిచయమవుతున్న సినిమా "వానర". ఈ చిత్రంలో సిమ్రాన్ చౌదరి హీరోయిన్ గా నటిస్తోంది. నందు ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. సాయిమాధవ్ బుర్రా డైలాగ్స్ అందిస్తున్న "వానర" సినిమా సోషియో ఫాంటసీ కథతో ప్రేక్షకుల్ని ఆకట్టుకునేందుకు రాబోతోంది. "వానర" చిత్రాన్ని శంతను పతి సమర్పణలో సిల్వర్ స్క్రీన్ సినిమాస్ బ్యానర్ పై అవినాశ్ బుయానీ, ఆలపాటి రాజా, సి.అంకిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. వివేక్ సాగర్ మ్యూజిక్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణ కాబోతోంది. ఈ రోజు రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ లో హీరో అవినాశ్ బైక్ పై వెళ్తుండగా, ఆయనను రక్షణగా హనుమంతుడు వెంటే వెళ్తున్న స్టిల్ ఆసక్తి కలిగిస్తోంది. "వానర" సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

## ఆన్‌లైన్ హింసను అరికట్టాలి

"మనం హింస గురించి ఆలోచించినప్పుడు వీధుల్లో, ఇంట్లో, పని ప్రదేశాల్లో జరుగుతుందనుకుంటాం. కానీ, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కూడా జరుగుతోంది. ప్రతి ముగ్గురిలో ఒక మహిళ హింసని ఎదుర్కొంటోంది" అని పేర్కొన్నారు సమంత. మహిళలపై పెరుగుతోన్న ఆన్‌లైన్ వేధింపులకు వ్యతిరేకంగా ఐక్యరాజ్య సమితితో కలిసి పని చేయనున్నారామె. మహిళల గౌరవాన్ని కాపాడటం అందరి బాధ్యత అంటూ యూఎన్ విమెన్ ఇండియా నిర్వహిస్తున్న 'నో ఎక్స్‌క్యూజ్' కార్యక్రమానికి సమంత మద్దతుగా నిలిచారు. నవంబరు 25న ప్రారంభమైన ఈ కార్యక్రమం డిసెంబర్ 10 వరకు జరగనుంది. "సోషల్ మీడియాలో కామెంట్స్, ఆన్‌లైన్ బెదిరింపులు, డీప్ ఫేక్ ఫొటోలు వంటివన్నీ జరుగుతున్నాయి. ఇవి మహిళలు నలుగురిలో తమ గొంతు వినిపించడానికి కూడా భయపడేలా చేస్తున్నాయి... అభద్రతాభావాన్ని కలిగిస్తున్నాయి. నేను ఎన్నోసార్లు ఈ పరిస్థితిని అనుభవించాను. వేధింపుల వల్ల చాలామంది మహిళల జీవితాలు, కెరీర్ ఆగిపోయాయి. ఆన్‌లైన్‌లో అబ్యూజ్ చేయడాన్ని జోక్‌గా ట్రీట్ చేయడం ఆపేస్తే మనం ఇంటర్నెట్‌ని బెటర్‌గా మార్చొచ్చు. ఆన్‌లైన్ హింసను అరికట్టడానికి మరింత బలమైన వ్యవస్థలు రావాలి. ఇది మహిళలకు భద్రతగా మారుతుంది. ఇలాంటి వాటిపై మహిళల్లో అవగాహన పెరగాలి" అని సమంత పేర్కొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com